ఖమ్మం రవాణాశాఖాధికారిగా జగదీష్

16నెలల తర్వాత రెగ్యులర్ డీటీవో నియామకం

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణాశాఖాధికారిగా ధర్మపురి జగదీష్‌ను నియమిస్తూ రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు జారీ చేశారు. 16నెలల తర్వాత ఖమ్మం రవాణాశాఖ కార్యాలయానికి పూర్తిస్థాయి డీటీవో నియామకం జరిగింది. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ డీటీవోగా ఖమ్మం ఎంవీఐ వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. ఖమ్మంలో డీటీవోగా బాధ్యతలు స్వీకరించేందుకు గతంలో అధికారులు ముందుకు రాలేదు. దీంతో 16నెలల పాటు ఇన్‌చార్జ్‌ల పాలనలో సాగింది.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు రేటింగ్

- 'స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ' పేరుతో గుర్తింపు
- ఆరు అంశాలపై ప్రత్యేక కమిటీ పరిశీలన పూర్తి
- నవంబరు 1 నుంచి 15 వరకు రెండో దశ
- జాతీయ స్థాయికి ఎంపికైతే రూ.లక్ష ప్రోత్సాహం
- జిల్లా నుంచి 1,638 పాఠశాలల్లో పరిశీలన



ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఆరు అంశాల ఆధారంగా స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్స్ అందించటం జరిగిందని జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి ప్రవీణ్ కుమార్ గురువారం తెలిపారు. జిల్లాలో మొత్తం 1,638 పాఠశాలకు రేటింగ్స్ అందించనున్నారని, అందులో 5స్టార్ 75 పాఠశాలలు, 4స్టార్ 775, 3స్టార్ 694, 2స్టార్ 73, సింగిల్ స్టార్ రేటింగ్ 21 పాఠశాలలుగా గుర్తించారన్నారు. ఈ పరిశీలలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందించారని వీటిపై రెండో సారి సర్వేను జిల్లాలోని 98 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బృందం పరిశీలించి చివరిగా రేటింగ్స్ అందించటం జరుగుతందని తెలిపారు. ఈ ప్రక్రియ నవంబరు 1 నుంచి 15 వరకు పూర్తి చేసి 16న రేటింగ్స్ అందించనున్నట్టు తెలిపారు. ఎస్‌హెచ్‌వీఆర్ రేటింగ్స్ ద్వారా పాఠశాలలు శుభ్రతలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, శానిటేషన్, విద్యార్థుల ఆరోగ్య భద్రత అంశాలలోనూ ప్రత్యేక గుర్తింపు పొందే పాఠశాలలకు ప్రత్యేక కమిటీ పర్యటించి పాఠశాలల తీరులను పర్యవేక్షిస్తారని తెలిపారు. దేశవ్యాప్తంగా 200పాఠశాలలను ఎంపిక చేసి ఒక్కో పాఠశాలకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకంతో పాటు సంబంధిత ఉపాధ్యాయులను మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా ఉన్న విహార కేంద్రాల సందర్శనకు తీసుకు వెళ్లనున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 4, 5 స్టార్ వచ్చిన వాటిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. 35 నుంచి 50 పాయింట్లున్న పాఠశాలలకు 2 స్టార్, 50 నుంచి 74 పాయింట్లున్న పాఠశాలలకు 3స్టార్, 75 నుంచి 89పాయింట్లు ఉన్న పాఠశాలలకు 4స్టార్, 90 నుంచి 100పాయింట్లున్న పాఠశాలలకు 5స్టార్ రేటింగ్స్ మొదటి దశ సర్వేలో అందించనున్నారన్నారు. రెండో సర్వేలో వచ్చిన పాయింట్ల ఆదారంగా రేటింగ్స్ మారుతాయని తెలిపారు. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో 60ప్రశ్నలకు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలు ఇచ్చే సమాధానాలను బట్టి రేటింగ్స్‌ను అందించనున్నట్టు తెలిపారు. 60 ప్రశ్నలకు 120 మార్కులు ఉంటాయని, 100 మార్కులు దాటిన వాటికి 5స్టార్ రేటింగ్స్ ఇస్తారన్నారు. జిల్లాలోని వివిధ మండలాలో 1స్టార్ రేటింగ్స్ పొందిన పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లో 18, పట్టణ ప్రాంతాల్లో 3, మొత్తం 21, 2స్టార్ పొందిన పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాలలో 67, పట్టణప్రాంతాల్లో 6 మొత్తం 73, 3స్టార్ పొందిన పాఠశాలలు గ్రామీణ ప్రాంతంలో 543, పట్టణప్రాంతంలో 151, మొత్తం 694, 4స్టార్ పొందిన పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లో 601, పట్టణ ప్రాంతాల్లో 174, 5స్టార్ పొందిన పాఠశాలలు గ్రామీణ ప్రాంతాలలో 62, పట్టణ ప్రాంతాల్లో 13 మొత్తం 75 పాఠశాలలను గుర్తించి వాటిలో 3స్టార్, 4స్టార్, 5స్టార్ రేటింగ్స్ వచ్చిన పాఠశాలలో రెండో దశ పరిశీలన జరుగుతుందని సీఎంవో తెలిపారు.

రైతులు 'తెల్ల'బంగారంగా భావించే పత్తి పంట వారి ఇంట కాసుల పంట పండించలేకపోతోంది. రూ.వేలకు వేలు పెట్టుబడులు పెడుతున్న క్రమంలో కాలం కలిసి రాక దిగుబడులు రాక.. సరైన ధరలు దక్కక.. నష్టాలు మూటగట్టుకుంటూ దిగాలు పడుతున్నారు. ఈ ఏడాది ఓ వైపు అధిక వర్షాలు.. మరోవైపు కనీస మద్దతు ధర కూడా రాక కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ క్రమంలో ఖమ్మంజిల్లాలోని పలువురు రైతులు ఇక 'లాభం' లేదని పత్తిపంటను దున్ని మొక్కజొన్న సాగుకు సై అంటున్నారు. కష్టకాలంలో ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ తేమశాతంనిబంధనలు వారికి శాపంగా మారడంతో మరింత కుంగిపోతున్నారు.

6



చింతకాని మండలం లచ్చగూడెంలో పత్తిని తొలగిస్తున్న దృశ్యం

ధర లేక.. దిగుబడి రాక

- దిగాలు పడుతున్న పత్తి రైతు
- పత్తిపంటను దున్ని మొక్కజొన్నసాగుకు సన్నద్ధం
- కష్టకాలంలో ఆదులేకోలేపోతున్న సీసీఐ
- రెండో తీత దశలో నష్టం మిగిల్చిన భారీ వర్షాలు

ఖమ్మం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లాలో కూడా ఈఏడాది పత్తి పంటల భారీగా సాగయ్యింది. సుమారు 2.50లక్షల ఎకరాల్లోపైగా వేశారు. మొదట్లో వర్షాలు ఆశాజనకంగా పడినా ఆ తర్వాత క్రమేపీ భారీవర్షాలు, తుఫాన్లు పత్తిరైతుకు శాపంగా మారాయి. పంట చేతికొచ్చే సమయంలో కూడా నిత్యం వర్షం పడడంతో పత్తిపంట చేలోనే కారిపోవడం, నల్లబడడం, నాణ్యత దెబ్బతింది. ఎకరానికి 10క్వింటాలుపైగా రావల్సిన పత్తి 5క్వింటాళ్లకు పడింది. దీంతో పత్తి రైతు ఆశలు అడియాశలయ్యాయి. దిగుబడి తగ్గగా మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతలు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఎకరానికి సుమారు కౌలుతో కలిపి రూ.40వేల నుంచి రూ.50వేలు పెట్టుబడి అయింది. కనీసం పెట్టుబడి రావాలంటే 5క్వంటాళ్ల దిగుబడివస్తే రూ.10వేలు ధర ఉంటేనే గిట్టుబాటవుతుంది. సీసీఐ కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8,110కాగా ఖమ్మం వ్యవసాయమార్కెట్‌తోపాటు ప్రైవేటు కొనుగోలు దారులు క్వింటా రూ.6,500నుంచి రూ.7,100కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కంటే క్వింటాకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 ధర తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. వర్షానికి తడిచి తేమశాతం ఎక్కువ ఉన్న పత్తికి కొన్నిచోట్ల రూ.6వేలు కూడా ధర పెడుతున్నారు. అయినప్పటికి రైతులు సీసీఐ నిబంధనలకు భయపడి ప్రైవేటు వ్యాపారులకు, వ్యవసాయమార్కెట్లకు తరలించి తక్కువ ధరకే అమ్ముతున్నారు. దీంతో ఎకరానికి 5క్వింటాళ్ల దిగుబడి వస్తే రూ.30నుంచి 35వేల వరకు మాత్రమే రాబడి వస్తుంది. పెట్టుబడి కూడా రాక పత్తిరైతులు తల్లడిల్లుతున్నారు. ఖమ్మం జిల్లాలో ఏన్కూరు, చింతకాని, కారేపల్లి, కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, ముదిగొండ, కొణిజర్ల, తల్లాడ, వైరా, బోనకల్, ఎర్రుపాలెం, నేలకొండపల్లి తదితర మండలాల్లో పత్తిసాగు అదికంగా ఉంది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ధర లేకపోవడం దిగుబడులు లేక పత్తిరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పత్తిని తొలగించి.. మొక్కజొన్న సాగుపై దృష్టి

వాస్తవానికిపత్తిపంట సీజన్ ఫిబ్రవరి వరకు ఉంటుంది. సాగునీటి సౌకర్యం ఉన్న చోట తడులు పెట్టి ఎకరానికి 10క్వింటాళ్ల దిగుబడి తీసే అవకాశం ఉంది. ప్రస్తుతం పెట్టుబడులు భారీగా పెరగడం, దిగుబడులు దారుణంగా పడిపోవడం, గిట్టుబాటు ధర లేక రైతులు పత్తి సాగుకంటే మొక్కజొన్న సాగు లాభసాటిగా భావించి పత్తి పంట సగంలోనే దున్ని వేస్తున్నారు. మొదటి తీతకింద రెండు, మూడు క్వింటాళ్లు తీసిన రైతులు పెరిగిన కూలీల ఖర్చులు, ధర లేకపోవడంతో ఉంచినా దిగుబడి రాదని భావించి పత్తితోట దున్ని మొక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్నారు. దీంతో వేసవిలో మామూలుగా వేసే (మిగతా 6వ పేజీలో)

పత్తి దిగుబడి లేదు.. మొక్కజొన్న వేస్తున్నాం

దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, లచ్చగూడెం, చింతకాని



రెండెకరాల్లో పత్తి వేశా. ఎకరానికి రూ.25వేలు పెట్టుబడి పెట్టా. దిగుబడి 3క్వింటాళ్లు వచ్చింది. క్వింటా రూ.6,100 అమ్మా. వర్షాలకు పత్తిపంట పూర్తిగా పాడైపోయింది. ఉంచినా మళ్లీ దిగుబడిరాదు. ప్రతీ ఏడాది ఎకరానికి 10క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. అందుకే పంట ఉంచినా దిగుబడిరాదని మొక్కజొన్న వేస్తున్నా. మొక్కజొన్న వేయడం ద్వారా లాభంగా ఉంటుంది.

క్రీడా సంఘాల లెక్క.. ఇక పక్కా

- గుర్తింపు లేని వాటికి చెక్ పెట్టేందుకు రంగం సిద్ధం
- అసలైన అసోసియేషన్ల గుర్తింపునకు శాట్స్ ఆదేశాలు
- జిల్లాకు సంబంధం లేని వ్యక్తులను సంఘాల్లో ఎన్నుకోవద్దని సూచన
- నూతన క్రీడాపాలసీలో భాగంగానే సమాచారం సేకరణ
- వివరాల అందజేతకు ముగిసిన సమయం



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న క్రీడా సంఘాలు, గుర్తింపు లేని అసోసియేషన్‌లు క్రీడా రంగంతో పాటు క్రీడాకారుల భవిష్యత్‌ను కుదేలు చేస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు క్రీడలతో సంబంధం లేని వ్యక్తులు, ఇతర జిల్లాల వారు ఎప్పట్నుంచో క్రీడా సంఘాలకు తామే దిక్కన్నట్టు వ్యవహరిస్తుండటంతో పాటు ఒకే క్రీడాంశానికి రెండు మూడు అసోసియేషన్లు తయారవడంతో క్రీడాకారుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందన్న ఆరోపణలున్నాయి. వాటన్నింటికీ చెక్ పెట్టేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్) నడుం బిగించింది. ఈ మేరకు జిల్లాలోని క్రీడా సంఘాలన్నీ తమ అసోసియేషన్ వివరాలు, క్రీడా సంఘాల బైలాలు, స్టేట్ అసోసియేషన్ అఫిలియేషన్ పత్రంతో పాటు జిల్లా అసోసియేషన్ గుర్తింపు పత్రాలను, ఆయా సంఘాల సర్వసభ్య సమావేశ వివరాలను జిల్లా క్రీడల కార్యాలయాల్లో అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక అన్నీ శాట్స్ ఫార్మాట్ ప్రకారం సరిపోయిన క్రీడా సంఘాన్ని గుర్తింపు పొందిన సంఘంగా ధ్రువీకరించనున్నారు. దీంతో ఇప్పటి వరకు ఒక్క లెటర్‌హెడ్‌పై మాత్రమే క్రీడా సంఘంగా తమను తాము స్వతహాగా క్రీడా సంఘంగా రూపొందించుకున్న కొన్ని క్రీడా సంఘాల బాధ్యులు ఏంచేయాలో తెలియక దిక్కులేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. క్రీడా సంఘాల వివరాలు అందించేందుకు మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. ఇక జిల్లా క్రీడల శాఖ అడిగిన వివరాలు అందించేందుకు గురువారం వరకు మాత్రమే సమయం ఉండటంతో కొంత మంది క్రీడా సంఘాల బాధ్యులు స్టేట్ అసోసియేషన్లను సంప్రదించడానికి, కావాల్సిన పత్రాలు తీసుకొచ్చేందుకు హుటాహుటిన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు పోవడం విశేషం.

ఇక లెక్క పక్కా

ఖమ్మం జిల్లాలో మొత్తం సుమారు 35 క్రీడా సంఘాలు ఉండగా.. భద్రాద్రి జిల్లాలో సుమారు 32క్రీడా సంఘాలు ఉన్నాయి. వీటిలో ఖమ్మం జిల్లాలో కేవలం రెండు, మూడు సంఘాలు.. భద్రాద్రి జిల్లాలో ఐదారు సంఘాలు మాత్రమే అసోసియేషన్లు బైలాల ప్రకారం నడుచుకుంటున్నట్టు సమాచారం. వాస్తవానికి ప్రతీ క్రీడా సంఘం ప్రతి నాలుగేళ్లకోసారి కొత్త కమిటీలను ఎన్నుకోవాలి. మూడు నెలలకు ఒక సారి జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించుకోవాలి. ఆయా సంఘాల్లో క్రీడలకు సంబంధించిన వారిని, జిల్లాకు చెందిన వారిని ముఖ్య పదవుల్లో ఎన్నుకుంటారు. కొంతమంది సీనియర్ క్రీడాకారులకు అవకాశం ఉంటుంది. అధ్యక్ష, కార్యదర్శి పదవుల్లో ఉండే వారు ప్రభుత్వ (మిగతా 6వ పేజీలో)

ఇంటింటికి సీపీఐ శతాబ్ది సంబరాలు

- డిసెంబరు నుంచి సభలు, సెమినార్లు
- జిల్లా కార్యవర్గ సమావేశంలో జాతీయ సమితి సభ్యుడు బాగం



ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు ఉద్యమాల పురిటిగడ్డ ఖమ్మం వేదిక కానుందని, ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి శతాబ్ది ఉత్సవాల పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ కార్యకర్తల నుంచి అభిమానుల వరకు సహకరించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. ఈ మేరకు గురువారం ఖమ్మం సీపీఐ జిల్లా సమితి కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు సభపై ప్రచారంపై కార్యాచరణ చేశారు. వందేళ్లుగా సీపీఐ చేసిన ఉద్యమాలు, పోరాటాలు, బలిదానాలను నేటి సమాజానికి తెలియజేయాలని, డిసెంబరు నుంచి ప్రత్యేకంగా సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి అనేక ఉద్యమాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ డిసెంబరు 26న ఖమ్మంలో లక్షలాది మందితో ముగింపు సభ ఉంటుందన్నారు. ఈ సభ కోసం ఉమ్మడి జిల్లా నుంచి వందలాది మంది యువకులకు జనసేవాదళ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేశ్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూసలపాడులో ధాన్యం తేమశాతాన్ని పరిశీలించిన డీఎస్‌వో

ధాన్యం తేమశాతం నిర్ధారణలో తేడాలు

- డీఎస్‌వో తనిఖీలతో వెలుగులోకి
- పాత, కొత్త మీటర్లలో వ్యత్యాసాలు

వైరా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైరా మండలంలోని పూసలపాడు, గరికపాడు సొసైటీల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమశాతం నిర్ధారణకు వినియోగిస్తున్న మీటర్లలో తేడాలు వెలుగు చూశాయి. గురువారం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి(డీఎస్‌వో) కె.చంద్రకుమార్ తనిఖీలు చేసిన సమయంలో ఈ తేడాలు బయటపడ్డాయి. పూసలపాడు సొసైటీ పరిధిలోని నారపనేనిపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్‌వో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ తేమశాతం రాగానే ధాన్యాన్ని మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశామని, మిల్లులు కూడా ట్యాగ్ చేయటం పూర్తయిందని తెలిపారు. ధాన్యం తేమశాతాన్ని కొత్తగా ఏఎంసీ ద్వారా ఇచ్చిన మీటర్లలో పరిశీలించారు. పాత మీటర్లకు కొత్త మీటర్లకు తేమశాతం తేడా అధికంగా ఉండటాన్ని గుర్తించారు. వెంటనే అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి దృష్టికి డీఎస్‌వో ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. తేమశాతం తేడా చూపిస్తున్న మీటర్లను వాపస్ తీసుకోమని అదనపు కలెక్టర్ సూచించారు. దాంతో తేమశాతం అధికంగా చూపిస్తున్న మీటర్లను డిఫెక్ట్ అని నిర్ధారించి వాటిని ఎవరికి ఇవ్వొద్దని డీఎస్‌వోను ఆదేశించారు. ఆతర్వాత దాచాపురం సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీచేశారు. సివిల్‌సప్లయీస్ ఆర్‌ఐ కిరణ్‌కుమార్, పూసలపాడు,గరికపాడు సొసైటీల అధ్యక్షులుశ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, కార్యదర్శి చిన్నకృష్ణయ్య పాల్గొన్నారు.

మెట్టినింట దొంగతనానికి కోడలి స్కెచ్



వివరాలు వెల్లడిస్తున్న పాల్వంచ డీఎస్పీ సతీష్

- అత్త సొమ్ములు కాజేసేందుకు తండ్రి, కుమారుడితో కలిసి పథకం
- సుపారీ గ్యాంగ్‌తో బేరం.. బెడిసికొట్టిన వ్యూహం
- రెక్కీ నిర్వహిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులకు చిక్కిన వైనం
- తొమ్మిది మందిని అరెస్టు .. పరారీలో కోడలు
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన పాల్వంచ డీఎస్పీ సతీష్

7

50శాతం స్కూల్ గ్రాంట్ల విడుదల

- సర్కారు బడులకు మొదటివిడత కేటాయిస్తూ ఉత్తర్వులు
- వినియోగంపై మార్గదర్శకాల జారీ


బోనకల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ బడులకు మొదటివిడత కింద 50శాతం స్కూల్ గ్రాంట్లను విడుదల చేశారు. ఈ మేరకు ఎస్ఎస్ఏ రాష్ట్ర డైరెక్టర్ నవీన్ నికోలాస్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఖమ్మం జిల్లాలోని 1,032, భద్రాద్రి జిల్లాలోని సుమారు వెయ్యి పాఠశాలలకు గ్రాంట్లు విడుదల అయ్యాయి. అలాగే ఈ గ్రాంట్ల వినియోగంపైనా మార్గదర్శకాలను జారీ చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి గ్రాంట్లు పాఠశాల ఖాతాల్లో జమవనున్నాయి. 30 మంది విద్యార్థులుంటే రూ. 10 వేలు, 100 వరకు ఉంటే రూ.25వేలు, 250మంది వరకు ఉంటే రూ.50 వేలు, వెయ్యి మంది వరకు ఉంటే రూ.75వేలు, వెయ్యికి పైగా ఉంటే రూ.లక్ష మంజూరవుతాయి. తొలి విడతలో 50 శాతం నిధులు పాఠశాలల ఖాతాల్లో వేశారు.

వినియోగానికి మార్గదర్శకాలవీ..

రిజిస్టర్లు, రికార్డులు, పేపర్లు తదితర స్టేషనరీ వస్తువుల కొనుగోలు చేపట్టాలి. స్వాంతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల వేడుకలకు ఖర్చుతో పాటు ఇంటర్నెట్ చార్జీలు, కంప్యూటర్, ప్రొజెక్టర్, టీవీ, కీ-యాన్, ఆర్‌వోటీ లాంటి పరికరాల మరమ్మతులు, సైన్స్ ల్యాబ్‌కి రసాయనాలు, తలుపులు, కిటికీలు, పాఠశాల మరమ్మతు పనులు, తాగు నీటి సౌకర్యం, (మిగతా 6వ పేజీలో)

భద్రాద్రి దేవస్థానం పాలకమండలి ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

అధికారిక ప్రకటన జారీ



భద్రాచలం నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం పాలకమండలి ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం అధికారిక ప్రకటన జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత తొలిసారిగా రూపుదిద్దుకోనున్న కొత్త పాలకమండలి కోసం ఎదురుచూస్తున్న ఎందరో ఆశావహులు ఏప్పటినుంచో తమ ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనంతరం ఒక దఫా ప్రకటన జారీ చేసినా అది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ప్రకటన జారీ చేయడంతో మళ్లీ ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న రెండు విడతల్లోనూ ఒక్క సారి కూడా పాలకమండలి ఏర్పాటు కోసం చొరవ తీసుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత రెండోసారి అధికారిక ప్రకటన జారీ చేయడంతో ఈసారైనా భద్రాద్రి దేవస్థానం పాలకమండలి రూపదిద్దుకుంటుందా అని అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఏఎంసీని సందర్శించిన
శాలిగౌరారం మార్కెట్ కమిటీ సభ్యులు



మార్కెట్‌ను సందర్శించిన శాలిగౌరారం మార్కెట్ కమిటీ సభ్యులు

ఖమ్మంమార్కెట్,నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను గురువారం నల్గొండజిల్లా శాలిగౌరారం మార్కెట్ కమిటీ సభ్యులు సందర్శించారు. స్టడీటూర్‌లో భాగంగా శాలిగౌరారం మార్కెట్ చైర్మన్ నరిగ నరసింహ, పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి,మార్కెట్‌కమిటీ సభ్యులు ఖమ్మం ఏఎంసీలో మిర్చి,పత్తి యార్డుల కార్యకలాపాలు, ఆధునిక యార్డుల నిర్మాణాలను పరిశీలించారు. అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. వారివెంట ఖమ్మంవ్యవసాయ మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్‌చైర్మన్ తల్లాడ రమేష్, డీఎంవో అలీం, అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు ఉన్నారు.

చిత్తడి భూముల పరిరక్షణతో పర్యావరణానికి మేలు

ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు6(ఆంధ్రజ్యోతి): చిత్తడి భూముల (వెట్‌ల్యాండ్) సంరక్షణతో పర్యావరణానికి మేలు జరుగుతుందని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన వెట్‌ల్యాండ్ కమిటీ సమావేశంలో ఖమ్మం జిల్లా అటవీఅధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. వెట్‌ల్యాండ్‌గుర్తింపు, సంరక్షణ కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసిందని దీనికి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 8వేల911 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో చిత్తడి నేలల్లో పర్యటించి స్థానిక పరిస్థితులపై నివేదిక సిద్ధం చేసి గుర్తించిన చిత్తడి నేలలను 6 నెలల లోపు నోటిఫై చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. చింతకాని మండలం పైలెట్ కింద ఎంపిక చేసి ఇక్కడ చిత్తడి నేలలు గుర్తించి అక్కడ పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. నీటి వనరుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ సమీపంలో తడి భూములను గుర్తించాలన్నారు. రాబోయే మంగళవారం నాటికి ఈప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డీపీవో ఆశాలత, జిల్లా మత్స్య శాఖ అధికారి శివ ప్రసాద్, నీటిపారుదలశాఖ అధికారి టి.వెంకట్రాం, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, అనసేయ, మధిర, వైరా మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.





జ్యోతి ప్రజ్వలన చేసి యువజన ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, జానపద నృత్యం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు కళారంగాల్లో రాణించాలి

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
- ఘనంగా భద్రాద్రి జిల్లా యువజనోత్సవాలు

కొత్తగూడెంపోస్టాఫీస్‌సెంటర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంస్కృతిక, కళారంగాల్లో రాణించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. గురువారం కొత్తగూడెం క్లబ్‌లో భద్రాద్రి జిల్లా స్థాయి యువజన ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కళారంగాల్లో ప్రతిభను చాటుకోవాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుంటూ గురువులకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలన్నారు. కళారంగాలు విద్యార్థులకు అదనపు అర్హతగా ఉపయోగపడతాయన్నారు. నేటియువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభచాటి రాష్ట్ర, జాతీయ స్థాయి వేదికలపై రాణించాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో జానపదనృత్యం,జానపదగేయాలు(గ్రూప్), కవిత్వం, వ్యాసరచన పోటీలు,పెయింటింగ్, వకృత్వ పోటీలు,సైన్స్‌మేళా వంటి ఏడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డిప్యూటీ కలెక్టర్ స్పెషల్ ట్రెయినీ మురళి, కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్య, ఎస్జీఎఫ్ సెక్రటరీ నరేస్, డీవైఎస్‌వో పరందామరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సంపత్, చుంచుపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అధికారులతో న్యాయాధికారుల సమీక్ష

కొత్తగూడెంలీగల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి):జిల్లా కోర్టు మీటింగ్ హాలులో జిల్లా అధికారులతో న్యాయమూర్తులు సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లాప్రధాన న్యాయమూర్తిపాటిల్ వసంత్ మాట్లాడుతూ... పెండింగ్ కేసులలో త్వరితగతిన సాక్షులను కోర్టుల వారీగా తీసుకొని రావాలని, స్పీడు డిస్పోజల్‌కు సహకరించాలని, వారంట్‌లు త్వరితగతిన అమలుపరచాలని చెక్కు బౌన్స్ కేసులలో ఫిర్యాదుదారుల సహకారంతో వారెంట్‌లను అమలు పరచాలన్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున ఇల్లెందు, మణుగూరు కోర్టు కాంపౌండ్‌లను పరిశీలించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సరిత మాట్లాడుతూ ముఖ్యంగా పోక్సో కేసులలో సాక్ష్యం వెంట వెంటనే తీసుకుని రావాలని అందుకు పోలీసు అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 13న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించిన ధర్మిలా కోర్టు కానిస్టేబుళ్లకు, కోర్టు లైజాన్ ఆఫీసర్లకు ఎస్పీ రోహిత్‌రాజ్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో గమన్‌సత్య ప్రతిభ



ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఇటీవల వికారాబాద్‌లో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్- 14ఫుట్‌బాల్ పోటీల్లో భద్రాచలానికి చెందిన గమన్‌సత్య సత్తా చాటాడు. కాంస్య పతకం సాధించాడు. భద్రాచలానికి సుపరిచితులైన పాండవుల పెరుమాళ్ళ మాస్టర్ మనువడు కావడం విశేషం. ఈ సందర్భంగా రాష్ట్రపోటీలలో ప్రతిభ చూపిన గమన్‌ను పలు క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

రోడ్లపై వడ్లకుప్పలు..
ప్రమాదాలకు హేతువులు

అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం



కాకర్లపల్లిలో రోడ్లపై వడ్లను ఆరబోసిన దృశ్యం

సత్తుపల్లిరూరల్,నవంబరు6 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన పంటను ఆరోబోసేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారు.సత్తుపల్లి మండలంలో సుమారు 19,600ఎకరాలలో వరి సాగు చేయగా.. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రైతులు మిషన్ల సహాయంతో కోతలు పూర్తిచేశారు. సుమారు 80 శాతానికిపైగా వరిపంటను కోయగా.. చాలామంది రైతులు రహదారుల పక్కనే ఆరబోశారు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిసమయంలో వడ్లు ఆరబోసి అడ్డుగా పెట్టిన రాళ్లు ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయి. ఏటా ఇదే పరిస్థితి ఉంటున్నా.. రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. గత ప్రభుత్వంలో ఈజీఎస్ పథకం కింద ఒక్కో రైతు కల్లానికి రూ.50వేల నుంచి రూ.80వేల వరకు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. 50స్క్వేర్ మీటర్ల కల్లం నిర్మాణానికి రూ.54వేలు, 60స్క్వేర్ మీటర్లకల్లం నిర్మాణానికి రూ.68వేలు, 75స్క్వేర్ మీటర్ల కల్లం నిర్మాణంకోసం రూ.80వేలుమంజూరు చేసింది. కానీ వాటిని నిర్మించుకునేందుకు రైతులు ముందుకు రాకపోవడం, అధికారులు అవగాహన కల్పించకపోవడం, నిధులు విడుదలలో జాప్యం కారణంగా ఎక్కడా నిర్మాణాలు కనిపించడం లేదు. మండలంలో ఇప్పటివరకు 23 కల్లాలు నిర్మించగా మూడేళ్లుగా ఈ పథకం ఆదరణకు నోచుకోలేదని ఈజీఎస్ ఏపీవో మడుపు బాబు తెలిపారు. దీనిపై సత్తుపల్లి తహసీల్దార్ సత్యనారాయణ స్పందిస్తూ.. సత్తుపల్లి మండలంలో 17ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులు వడ్లను కేంద్రాలకు తరలించి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను పొందొచ్చన్నారు. ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తే ప్రమాదాలు జరిగే విషయాన్ని రైతులకు వివరించామని, మరోసారి అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు.



కరకగూడెంను కమ్మేసిన మంచు



కల్లూరులో పొగ మంచు

కమ్మేసిన పొగ మంచు

కల్లూరు/కరకగూడెం, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కల్లూరు, భద్రాద్రి జిల్లా కరకగూడెంలో గురువారం ఉదయం పొగ మంచు కమ్మేసింది. సీతకాలం సీజన్ ఈనెల నుంచి ప్రారంభమైంది. పగటి పూట ఎండలు కూడా కాస్తున్నాయి. ఇక సీతకాలం ప్రారంభం సమయంలో ప్రకృతి అనుకూలంగా పొగమంచు కూడా పడుతుంది. గురువారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు పొగ మంచు పడింది. ప్రధాన వీధులు గంట పాటు మసకగా కనిసించాయి. ఇటీవల కురిసిన వర్షాలతో చలి తీవ్రత తక్కువగా ఉండి మరల మంచు కురుస్తుండటంతో చలితీవ్రత క్రమంగా పెరుగుతోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు



దుమ్ముగూడెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఆర్లగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 5న ఖమ్మంలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ ఎంపికకు ఆర్లగూడెం ఆశ్రమపాఠశాలకు చెందిన ఐదుగురు పాల్గొన్నారు. వీరిలో పదోతరగతి విద్యార్థులు ఎం.అఖిల్, విక్రమ్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో త్వరలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారు. రాష్ట్రస్థాయికు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం కె.సోమశేఖర్, పీడీ ఎం.వసంతం,ఉపాధ్యాయులు కె.లక్ష్మణరావు, టి.వెంకటేశ్వర్లు, పి.లక్ష్మయ్య,బి.రాజు, ఎ.రామచంద్రరావు, ఎం.పాపారావు, లింగమూర్తి బుధవారం అభినందించారు.

క్రీడా సంఘాల లెక్క.. ఇక పక్కా

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగి కాకూడదు. ఇదంతా ఒక లెక్క మాత్రమే... కానీ వాస్తవంగా అలాంటిది ఏ క్రీడా సంఘంలోనూ కనపడదు. ఒకే వ్యక్తి 20 ఏళ్లకు పైగా ఒక క్రీడా సంఘానికి అధ్యక్షుడిగా, కార్యదర్శిగా ఉంటాడు. అసలు నాలుగేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించరు. ఇక ఒక హోటల్‌లో మందు, విందు పార్టీలు చేసుకుంటూ ఏకగ్రీవ ఎన్నిక అంటూ సంఘాన్ని ఎన్నుకుంటారు. పోటీకి ఎవరూ రారు, ఎవరైనా వచ్చినా వారిని బయటకు వెళ్లగొడతారు. ఇదంతా ఒక మాయా ప్రపంచంలా ఉంటుంది. ఇక నుంచి అలాంటిది జరగడానికి అవకాశం లేకుండా క్రీడా సంఘాల లెక్క పక్కాగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం కావడంతో కొన్ని క్రీడా సంఘాల బాధ్యులకు మింగుడు పడని వ్యవహారంలా తయారైందని పలువురు పేర్కొంటున్నారు.

గుర్తింపు లేని సంఘాలకు చెక్ పెట్టేందుకు రంగం సిద్ధం

జిల్లాలో ఉన్న క్రీడా సంఘాలకు స్టేట్ అసోసియేషన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అఫిలియేషన్(గుర్తింపు) అనివార్యం. కాగా ఒక్కో క్రీడాంశానికి రెండు మూడు సంఘాలు, జిల్లాలో క్రీడాకారులకు అందుబాటులో లేని ఇతర ప్రాంతాలలో ఉన్న వ్యక్తులు బాధ్యులుగా ఉన్న క్రీడా సంఘాలు, గత పది నుంచి 20 ఏళ్లుగా ఒకే సంఘంలో కీలక పదవుల్లో ఉన్న వ్యక్తుల వివరాలు ఇప్పుడు బహిర్గతం కానున్నాయి. వారి లెక్కలన్నీ ఇప్పుడు నిగ్గు తేలనున్నాయి. గుర్తింపు లేని సంఘాలపై వేటు వేసేందుకు రంగం సిద్ధమవడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఇప్పటి వరకు క్రీడా సంఘాల పేరు చెప్పి చందాలు, స్పాన్సర్‌ల నుంచి దండుకున్న బడా బాబులు హడలెత్తి పోతున్నారు.

ప్రతి సంఘం కచ్చితంగా వివరాలు అందించాలి

సునీల్‌రెడ్డి, ఖమ్మం జిల్లా యువజన, క్రీడల అధికారి



జిల్లాలో ఉన్న ప్రతీ క్రీడా సంఘం కచ్చితంగా తమ అసోసియేషన్ల వివరాలు జిల్లా క్రీడల శాఖకు అందించాలి. గుర్తింపు లేని సంఘాలను, నకిలీ సంఘాలను నిగ్గు తేల్చేందుకు ఇది మంచి అవకాశం. క్రీడాకారులకు జవాబుదారీగా ఉండటానికి, క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడానికి క్రీడా సంఘాలు ముందుకు రావాలి. జిల్లాలో ఉన్న క్రీడా సంఘాలన్నీ జిల్లా యువజన, క్రీడల శాఖ పరిధిలోనే ఉండాలి. క్రీడారంగం అభివృద్ధి పథంలో పరిగెత్తి ఒలింపిక్ లాంటి అంతర్జాతీయ పోటీల్లో క్రీడాకారులు రాణించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది.

ధర లేక.. దిగుబడి రాక

(5వ పేజీ తరువాయి)

మొక్కజొన్న కంటే అధికంగా సాగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో పలు మండలాల్లో పత్తి పంటను ట్రాక్టర్లతో దున్ని మొక్కజొన్న సాగుచేస్తున్నారు. మొక్కజొన్నకు ధర కూడా ఆశాజనకంగా ఉంది. ప్రైవేటుగా క్వింటాకు రూ.2వేలు ధర ఉంది. ఎకరానికి 25నుంచి35క్వింటాళ్లపైగా దిగుబడి వస్తున్నాయి. పెట్టుబడి ఎకరానికి రూ.20వేలు మించిఉండదు. దీంతో కేవలం పత్తిపంటకు ఆరు నెలల కాలం కాగా మొక్కజొన్న పంట నాలుగు నెలలతోనే పూర్తవుతుంది. దీనికితోడు దిగుబడి ఆశాజనకంగా వస్తున్నందున రైతులకు కూలీలతోకూడా ఇబ్బంది లేనందున ఎకరానికి పెట్టుబడి రూ.20వేలు పోను రూ.30 వేల నుంచి రూ.40వేలు ఆదాయం వస్తుంది. పత్తి పంట ఎకరానికి కౌలుతో రూ.40పైగాపెట్టుబడిపెట్టినా 5క్వింటాళ్ల దిగుబడి వస్తే ధర లేక రూ.30వేలు నుంచి రూ.40వేలు మాత్రమే ఆదాయం వస్తోంది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు నష్టపోతున్న పరిస్థితి.

శాపంగా సీసీఐ నిబంధనలు

పత్తి రైతుల సంక్షేమానికికేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి రైతులకు కష్టకాలంలో భరోసా ఇవ్వలేకపోతోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులకు భరోసా ఇవ్వకపోగా.. నిబంధనలకు వారికి శాపంగా మారుతున్నాయి. ఈఏడాది అధిక వర్షాలతో దిగుబడిరాక నాణ్యత దెబ్బతిని రైతులు సర్వం కోల్పోయిన పరిస్థితి. ఈ క్రమంలో వారిని భరోసా ఇచ్చేందుకు సీసీఐ తేమశాతం నిబంధనల్లో ఎలాంటి సడలింపులు చేయలేదు. తేమశాతం నిబంధనలుసడలించాలని, వర్షాలకు తడిచిన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. కానీ ఎలాంటి స్పందన లేదు. 12శాతం కంటే తక్కువ తేమశాతం ఉంటేనే మద్దతు ధర రూ.8,100కి సీసీఐ కొనుగోలు చేస్తుంది. తేమశాతం 15శాతం ఉంటే కొనుగోలు చేయడంలేదు. ఆరబెట్టి తేమశాతం తగ్గిన తర్వాత తెస్తేనే పత్తి కొంటామంటూ సీసీఐ అధికారులు రైతులను తిప్పిపంపుతున్నారు. దీంతో సీసీఐ పత్తి కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. నిత్యం రైతులు పత్తితీసుకురావడంతో, తేమశాతంతో తిరస్కరణకు గురవ్వాల్సి వస్తోంది. ఈసీజన్‌లో ఖమ్మంజిల్లాలో 8జిన్నింగ్‌మిల్లులున్నచోట సీసీఐ కొనుగోలు కేద్రాలు ఏర్పాటు చేసింది. గడిచిన 15రోజుల్లో కేవలం సీసీఐ 589మెట్రిక్‌టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. గతసీజన్‌లో కేంద్రాలను తెరిచిన తొలి 15రోజుల్లోనే వెయ్యికి పైగా మెట్రిక్ టన్నుల పంటను కొనుగోలు చేసింది. ఈ ఏడాది ప్రైవేటుగా ఖమ్మం వ్యవసాయమార్కెట్‌తోపాటు ఇతర మార్కెట్లలో ఇప్పటి వరకు 7వేల మెట్రిక్ టన్నుల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేశారు.



పత్తి పంటతో నష్టం వచ్చింది

కూరపాటి రమణ, అనంతసాగర్, చింతకాని మండలం



పత్తిపంటవేసి దెబ్బతిన్నా. మూడెకరాల్లో వేసి నష్టపోయా. ఎకరానికి మూడు క్వింటాళ్లు మించి రాలేదు. వర్షాలకుపత్తి ఎర్రబడింది. కాయ నల్లబడి దెబ్బతిన్నది. ఇంకా పంట ఉంచినా ఉపయోగం లేదు. అందువల్ల దున్నేసి మొక్కజొన్న వేయడం ద్వారా కనీసం యాసంగిలోనైనా కొంత లాభం పొందుతా. పత్తి పంటకు కనీసం మద్దతు ధర రూ.10వేలు ఉంటనే పత్తిసాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తారు.

మూడు రోజులైనా సీసీఐ వారు పత్తి కొనలేదు

కొంపాటి భార్గవరావు, పొద్దుటూరు, చింతకాని మండలం



పదెకరాల్లో పత్తి పంటవేశా. ఎకరానికి 6క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ట్రాక్టర్‌లో గుర్రాలపాడు సీసీఐ కేంద్రానికి తీసుకెళ్తే 14శాతం తేమ ఉంది. 12శాతం ఉంటేనే కొంటామంటున్నారు. దాంతో మూడురోజులుగా అక్కడే పంటను ఆరబెట్టాల్సి వచ్చింది. ఆరబెట్టేందుకు కూలీలు క్వింటాకు రూ.100అడగుతున్నారు. పత్తిని ఆరబెట్టిన సమయంలో వానొస్తే తడస్తుందన్న భయం. తేమ శాతం తగ్గకపోతే సీసీఐ ఎక్కడ కొనదోనన్న ఆందోళనతో ఇబ్బందులు పడుతున్నాం. సీసీఐకి అమ్మితేనే పెట్టుబడి మందమైనా వస్తుంది. బయటమార్కెట్‌లో అమ్మితే క్వింటాకు రూ.6వేలనుంచి 6500వరకు అడుగుతున్నారు. దాంతో క్వింటాకు రూ.1500పైగానష్టపోవాల్సి వస్తుంది.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కొత్తగూడెం లీగల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి పాటిల్ వసంత్ గురువారం తీర్పు చెప్పారు. మణుగూరు మండలం పివి కాలనీకి చెందిన సూరపాక శివకృష్ణ తన ఫిర్యాదులో 2021 ఫిబవరి 6న తన తండ్రి సూరపాక రామనాథంను (60) అదే కాలనీకి చెందిన చెవుల సురేష్, తన వద్ద మద్యం ఉంది. వెళ్లి తాగుదామని సూరపాక రామనాథం ద్విచక్రవాహనం మీద రేగుల చెరువు వద్దకు తీసుకెళ్లి ఇద్దరు మద్యం సేవించిన తర్వాత సూరపాక రామనాథమును కర్రతో కొట్టి చంపి, రామనాథం వద్ద ఉన్న రూ.4000 నగదును అతని బైక్‌ను దొంగలించి తీసుకెళ్లాడు. ఈ విషయం తెలవగానే రామనాథం కుమారుడైన శివకృష్ణ అప్పటి మణుగూరు ఇన్‌స్పెక్టర్ ఆర్. భాను ప్రకాష్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు అనంతరం చెవుల సురేష్ పై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో 11 మంది సాక్షులను విచారించిన అనంతరం సురేష్‌పై నేరం రుజువు కాగా, జీవిత ఖైదు, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిడి లక్ష్మీ ప్రాసిక్యూషన్ నిర్వహించగా కోర్టు నోడల్ ఆఫీసర్ (ఎస్ఐ) డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ ఆఫీసర్ ఎన్. వీరబాబు (కోర్టు డ్యూటీ ఆఫీసర్) పీసీఎం అశోక్ సహకరించారు.

50శాతం స్కూల్ గ్రాంట్ల విడుదల

(5వ పేజీ తరువాయి)

మరుగుదొడ్ల శుభ్రత, పాఠశాల పారిశుధ్య పనులు, హైజీన్ నిర్వహణ చేపట్టాలి. పది శాతం నిధులు స్వచ్ఛ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేతులు శుభ్రం చేసుకొనే సామగ్రిని కొనుగోలు చేయాలి. విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఈ గ్రాంట్‌ను వినియోగించ కూడదు. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానం ద్వారా ఖర్చులు చేయాలి. స్టాక్ రిజిస్టర్లను నిర్వహించాలి. ఖర్చు వివరాలను నోటీసు బోర్డు పై ప్రదర్శించాలి. ప్రతీ నెలా ఎస్ఎంసీ సమావేశంలో గ్రాంట్ల వినియోగం పై చర్చించాలి. మొదటి విడత నిధుల వినియోగం తరువాత రెండవ విడత నిధులు మంజూరు చేస్తారు. ఈ నిధులన్ని మార్చి 31లోపు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

మంత్రి తుమ్మల చొరవతో..
ఖమ్మంలో ఐటీ రంగ అభివృద్ధికి కృషి

- కాంగ్రెస్ నేత యుగంధర్
- నిరుద్యోగులకు 'టెక్‌స్కై' నియామక పత్రాల అందజేత



ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న యుగంధర్, బత్తినేని ప్రకాష్, స్వాతి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖమ్మంలో ఐటీ రంగం అభివృద్ధికి కృషిచేస్తున్నామని కాంగ్రెస్ నేత తుమ్మల యుగంధర్ పేర్కొన్నారు. గురువారం రాత్రి ఖమ్మం ఐటీహబ్‌ను ఆయన సందర్శించిన ఆయనకు తొలుత టెక్ స్కై ఐటీ సొల్యూషన్ కంపెనీ ఎండీ బత్తినేని ప్రకాష్, సీఈవో బత్తినేని స్వాతి స్వాగతం పలికారు. అనంతరం టెక్‌స్కై కంపెనీలో ఉద్యోగాలు సాధించిన నిరుద్యోగ యువతకు నియామకపు పత్రాలను అందజేశారు. ప్రకాష్, స్వాతి మాట్లాడుతూ కొత్తగా నిర్మిస్తున్న రెండో దశ టీ హబ్ పనులను పూర్తి చేస్తే మరికొందరికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని వివరించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఐటీహబ్‌లున్నా ఖమ్మం హబ్ నిర్వహణ విజయవంతంగా జరుగుతోందన్నారు. ఐటీహబ్ కొత్తగా నిర్మిస్తే దేశ విదేశాలకు చెందిన ఐటీ కంపెనీలు తమ కార్యాకలాపాలు నిర్వహించేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు.

అనంతరం యుగంధర్ మాట్లాడు తూ ఖమ్మంలో ఐటీరంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని దీనికి అవసరమైన ప్రతిపాదనలు ప్రణాళికలను అందజేయాలన్నారు. విషయాలను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లి ఖమ్మంలో పదివేల మందికి ఐటీరంగంలో ఉపాధికల్పించేలా సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ప్రైవేటీకరణ కుట్ర

- రేపు, ఎల్లుండి ఖమ్మంలో మూడు రాష్ట్రాల జోనల్ మహాసభలు
- ఎల్ఐసీ ఏవోఐ సంఘం ఆల్ ఇండియా కార్యదర్శి ముంజునాథ్



మాట్లాడుతున్న మంజునాథ్

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల నిర్మాణం నుంచి సంక్షేమ పథకాలు అమలు వరకు కేంద్ర ప్రభుత్వానికి ఎప్పుడు ఆర్థిక అవసరాలు వచ్చినా ప్రభుత్వ ఎల్ఐసీ నుంచి రూ.వందల కోట్లు అప్పుగా తీసుకుంటుందని లాబాల బాటలో ఉన్న ఎల్ఐసీని కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తోందని ఎల్ఐసీ, ఏవోఐ సంఘం ఆల్ ఇండియా కార్యదర్శి ఎల్ ముంజునాథ్ పేర్కొన్నారు. గురువారం మంచికంటి భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలో ఎల్ఐసీ నిర్వహించి దివాళ తీసిన కంపెనీతో మోదీ పరోక్షంగా ట్రంప్‌తో సంబంధాలు పెట్టుకున్నారని, టాటా, బిర్లా, ఆదానికి ఎల్ఐసీని అమ్మేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. 1956 నుంచి ఎల్ఐసీ ఏజెంట్లుకు ఒకే స్లాబ్ విదానంలో కమిషన్ చెల్లింపులు జరుగుతున్నాయని అయినా ఎల్ఐసీని నిలబెట్టేందుకు ఏజెంట్లు తమవంతు కృషి చేస్తున్నారని అయితే ఇటీవల కేంద్రం దుర్మార్గంగా ఏజెంట్లు కమిషన్ తగ్గించదని ఏజెంట్లు వ్యవస్థను నిర్వీర్యం చేయటం ద్వారా ఎల్ఐసీ నష్టాల్లోకి వెళితే వెంటనే ప్రైవేటీకరణకు వెళ్లాలని మోదీ ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. అయితే ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎల్ఐసీని నిలబెట్టుకుంటామని అందుకే ఉద్యమాల ఖిల్లాగా ఉన్న ఖమ్మంలో ఈనెల 8, 9 తేదిల్లో సౌత్ జోనల్‌లోని ఏపీ, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల మహాసభలు ఖమ్మంలో నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆవిర్భావించిన ఎల్ఐసీ ఏవోఐ సంఘం ఖమ్మంలో మహాసభలు నిర్వహించట ఉత్సహ పూరితంగా ఉందన్నారు. మహాసభలు ఆల్‌ఇండియా నాయకులతో పాటుగా సీఐటీయూ జాతీయ కమిటి నాయకులు హాజరైతారని తెలిపారు. సమావేశంలో జోనల్ కార్యదర్శి నర్సింహారావు, తెలంగాణ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాస్, అధ్యక్షురాలు నాగరత్నం, నవీన్, వలీ మోహినుద్దీన్, ఆహ్వాన సంఘం నాయకులు వీ మల్లీఖార్జున్‌రావు, మందపల్లి సురేశ్, ఉసికల ప్రసాద్, పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆయుధం

ఖమ్మం జిల్లాలో 210 క్యాన్సర్ కేసులు

నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం



ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో క్యాన్సర్ పరీక్షల కోసం వచ్చిన మహిళలు (ఫైల్)

ఈ నియమాలు కచ్చితంగా పాటించాల్సిందే..!

- పొగ తాగడం, మద్యపానం పూర్తిగా మానేయాలి.
- కేక్స్, కార్బోనేటెడ్ డ్రింక్స్, చిప్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి.
- రెడ్ మీట్, వేయించిన పదార్థాలు తగ్గించాలి.
- నిరంతరం వ్యాయామం చేయాలి
- 40ఏళ్ల దాటిన మహిళలు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి.

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): "ఖమ్మం చెందిన ఓ మహిళ రొమ్ము క్యాన్సర్ బారిన పడగా.. అప్రమత్తత, అవగాహనతో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్నారు..!"

"తిరుమలాయపాలెం మండల పరిధిలో ఓ మహిళ గర్భాశయ క్యాన్సర్ బారినపడి రూ.లక్షలు వెచ్చించి చికిత్స చేయించినా నెలల వ్యవధిలోనే మృతి చెందింది.."

క్యాన్సర్ మహమ్మారి ఇటీవల జిల్లాలో ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. గతంలో ఊరికొక్కరో.. మండలానికి ఒక్కరో ఉండే బాధితుల సంఖ్య ఇటీవల ఎక్కువ అవుతోంది. ముఖ్యంగా మహిళల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ బాధితులు భారీగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. పురుషుల్లో సైతం గొంతు, పెద్దపేగు, ఊపిరితిత్తుల క్యాన్సర్లు పెరుగుతున్నాయి. వీటికి ఆహార అలవాట్లతో పాటు చెడు వ్యసనాలు సైతం కారణమవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ధైర్యం, అప్రమత్తత, అవగాహనతో క్యాన్సర్‌ని నియంత్రించవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు.

● జిల్లాలోని 26 పీహెచ్సీలు, నాలుగు యూపీహెచ్‌సీల పరిధిలో ఇప్పటి వరకు 81మంది కేన్సర్ బాధితులను గుర్తించారు. అధికంగా బోనకల్, ఎంవీపాలెం, సుబ్లేడు, ఖమ్మంనగరంలోని పట్టణ దవాఖానాలో, మంచుకొండలో అధికంగా కేసులు నమోదయ్యాయి. వీటి పరిధిలో మొత్తం 81 కేసులున్నాయి. వీరే ఎన్సీడీ ద్వారా గుర్తించిన కేసులే కాగా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారిని పరిగనలోకి తీసుకుంటే జిల్లాలో బాధితుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనే 129 మంది ఉన్నారు.

● ఖమ్మంలో పాలియేటివ్ సెంటర్ ద్వారా చికిత్స ఖమ్మం పెద్దాస్పత్రిలోని పాలియేటివ్ (అలన) సెంటర్లో కేన్సర్ బాధితులకు వైద్య సేవలందిస్తున్నారు. ఈ సెంటర్ ఏడు పడకల సామర్థ్యంతో ఉండగా.. ఇన్‌పేషంట్, ఔట్ పేషంట్ సేవలే కాక తీవ్రత ఆధారంగా బాధితుల ఇళ్లకు వెళ్లి కూడా చికిత్స చేస్తున్నారు. సెంటర్ సిబ్బంది వాహనంలో వెళ్లి మందులు ఇస్తారు. పరిస్థితి మరింత విషమిస్తే సెంటర్‌కు తీసుకొస్తున్నారు. 2018 సెప్టెంబరులో మొదలైన ఈ సెంటర్ ద్వారా జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల వారు 2,111 మంది ఇన్‌పేషంట్, 6,154 మందికి ఔట్ పేషంట్ సేవలందించారు. అలాగే, వాహనంలో వెళ్లి ఇప్పటివరకు 18,028 మందికి పరీక్షలు చేశారు. కాగా, చివరి దశలో వ్యాధిని గుర్తించి పాలియేటివ్ సెంటర్ ద్వారా చికిత్స పొందిన 36 మంది మృత్యువాత పడ్డారని గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో జిల్లావాసులే కాక పొరుగు జిల్లాల వారు ఉన్నారు.

నివారించే ఆహార పదార్థాలు..

క్యాన్సర్‌ని నివారించేందుకు పోషకాహారం తీసుకోవడం ముఖ్యం. రోజువారీ భోజనంలో మొక్కల ఆధారిత పదార్థాలను చేర్చితే క్యాన్సర్‌ను చాలా వరకు నివారించవచ్చు. బ్రొకోలీ, చిక్కుడు, గ్రీన్‌టీ, బీన్స్, క్యారెట్, అల్లం, వెల్లుల్లి, పసుపు, మిరియాలు, దానిమ్మ, నారింజ వంటి

జిల్లాలో బాధితుల వివరాలు ఇలా...

- బ్రెస్ట్ క్యాన్సర్ : 87
- సర్వైకల్ కాన్సర్ : 63
- ఓరల్ కాన్సర్ : 2
- ఇతర రకాల కాన్సర్లు : 58
- కాన్సర్‌తో మృతి చెందిన మహిళలు: 36

జాబ్‌మేళాను సద్వినియోగపర్చుకోవాలి

మెగా జాబ్‌మేళాకు హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, ఎమ్మెల్యే కూనంనేని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సౌజన్యంతో ఈ నెల 12న కొత్తగూడెంలో నిర్వహించే జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగపరుచుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. జాబ్‌మేళా కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరుకానున్నట్లు వివరించారు. గురువారం కొత్తగూడెం క్లబ్‌లో జాబ్‌మేళాను విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళా కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి సుమారు పదివేల మంది హాజరయ్యే అవకాశం ఉందన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే నిరుద్యోగ యువతకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 50కు పైగా కంపెనీలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ జాబ్‌మేళా నిరుద్యోగులకు ఎంతో వరంగా మారుతుందని పదవ తరగతి నుంచి బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ తదితర అర్హత కలిగిన యువతకు అవకాశం ఉంటుందన్నారు. వివిధ కంపెనీలకు జాబ్‌కోసం దరఖాస్తు చేసుకునేందుకు క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో అభ్యర్థి ఐదు కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం ఉంటుందన్నారు. జాబ్‌మేళాకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లను చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ అధికారులందరూ జాబ్‌మేళాను విజయవంతం చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే పనుల్లో నిమగ్నం కావాలని కోరారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు జాబ్‌మేళాపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. అనంతరం మెగా జాబ్‌మేళా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మురళీధర్, సింగరేణి కొత్తగూడెం ఏరియా ఎస్‌వోటూ జీవి కోటిరెడ్డి, డీజీఎం సివిల్ రామకృష్ణ, ఎస్టేట్ ఆఫీసర్ తావూర్య, డీజీఎం మోహన్‌రావు, జాబ్‌మేళా కో ఆర్డినేటర్ చందర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీఓ మధు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, డీఎస్పీ రెహమాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణప్రసాద్, సీఐలు కరుణాకర్, ప్రతాప్, శివప్రసాద్, రాయల వెంకటేశ్వర్లు, ప్రభుత్వ అధికారులు సీపీఐ ఏఐటీయూసీ నాయకులు మల్లిఖార్జున్‌రావు, వాసిరెడ్డి మురళి, సలిగంటి శ్రీనివాస్, గట్టయ్య, చంద్రగిరి శ్రీనివాస్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

69వ రాష్ట్రస్థాయి క్రీడలకు సర్వం సిద్ధం

పరిశీలించిన జడ్పీ సీఈవో, డీఈవో నాగలక్ష్మి, డీఎల్‌పీవో సుధీర్‌బాబు

క్రీడాల్లో పాల్గొనేందుకు చేరుకుంటున్న టీమ్‌లు, ప్రాక్టీస్ షురూ



క్రీడా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో, డీఈవో నాగలక్ష్మి

పినపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి 69వ క్రీడాపోటీల నిర్వహణకు భద్రాద్రి కొత్తగూడెంజిల్లా ఈసారి వేదికగా ఎంపికైన సంగతి విదితమే. 69 వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 8,9,10 తేదీల్లో పినపాక మండలం, ఏడూళ్లబయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లతో నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి అండర్ 17 పాఠశాలల కబడ్డీ క్రీడా పోటీలకు తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులతో 10 బాలికల జట్లు, 10 బాలురు జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ సీఈఓ, డిఈఓ నాగలక్ష్మీ, జిల్లా డీఎల్‌పీఓ సుధీర్‌బాబు, ఆర్ డబ్ల్యూ ఎస్ డిఈ బ్రహ్మదేవ్, విద్యుత్ శాఖ ఏడీ జీవన్‌బాబు గురువారం సందర్శించి పరిశీలించారు. క్రీడా స్థలాలు, క్రీడాకారులు బస చేసేందుకు ఏర్పాట్లను పరిశీలించి, తగు సూచనలు చేశారు. క్రీడాకారులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లుండాలని మండలాధికారులను ఆదేశించారు. అవసరమైన మెటీరియల్, ఇతర ఏర్పాట్లకు అవసరమైన తోడ్పాటు అందిస్తామన్నారు. విద్యుత్, తాగునీరు, శానిటేషన్, హెల్త్ క్యాంప్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, భద్రతా సిబ్బంది, వంటి అంశాలతో సమగ్ర ప్రణాళికతో, జిల్లా యువజన క్రీడలు, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖ, విద్యా శాఖ, అటవీ, విద్యుత్ శాఖల సమన్వయంగా పని చేసి క్రీడలను విజయవంతం చేయాలన్నారు. నిర్దేశిత సమయంలోగా ఏర్పాట్లు పూర్తికావాలని, లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏడీ జీవన్‌బాబు ఆదేశాలను ఖాతరు చేయకుండా, విద్యుత్‌శాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నట్లు, సహకరించకపోవడం, తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తూ, మాట్లాడడంపై క్రీడా నిర్వాహకులు అయోమయానికి గురవుతున్నారు. ఏడూళ్లబయ్యారం ఫారెస్ట్ రేంజర్ తేజశ్వి, డీఆర్వో అరుణ, సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్‌లు సందర్శించి ట్రాఫిక్, పార్కింగ్, క్రీడాకారుల భద్రతలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తూ, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు క్రీడాకారులు ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పోట సంకీర్త్, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఎంఈఓ కె.నాగయ్య, ఇన్‌ఛార్జ్‌హెచ్‌ఎం కందితిరుపతిరెడ్డి, పీడీలు బి.వీరన్న, పి.అనిల్, రాములమ్మ, నాయకులు జి.రామనాథం, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాలిరెడ్డి, కార్యదర్శులు, పంచాయతీల మల్టిపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థులను చితకబాదిన వైస్ ప్రిన్స్‌పాల్

ఒకరికి అస్వస్థత.. ఖమ్మం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తండ్రి

భద్రాద్రి జిల్లా దమ్మపేట సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఘటన

ఆలస్యంగా వెలుగులోకి

దమ్మపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు విద్యార్థులను వైస్ ప్రిన్స్‌పాల్ అకారణంగా చితక బాదగా వారిలో ఓ విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగింది. గత నెల 30వ తేదీన జరిగిన ఈఘటన. అస్వస్థతకు గురైన విద్యార్థి తండ్రి గురువారం ఖమ్మం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో వెలుగులోకి వచ్చింది. గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కౌశిక్ నలుగురు తోటి విద్యార్థులతో కలిసి గత నెల 29న ఉదయం ఆటలాడుతున్నట్టు గమనించిన వైస్‌ప్రిన్స్‌పాల్ ఉపేందర్.. మరుసటి రోజు ఉదయం ప్రార్థన సమయంలో వారిని చితకబాదాడు. ఆ తర్వాత కౌశిక్ అనారోగ్యానికి గురవగా.. నాలుగురోజులు పాటు అతడిని పాఠశాలలో ఉంచుకొని.. అనంతరం 'మీ అబ్బాయికి జ్వరం వచ్చింది' అంటూ తండ్రి సుధాకర్‌కు పాఠశాల యాజమాన్యం సమాచారం అందించింది. దాంతో సుధాకర్ పాఠశాలకు వెళ్లి కుమారుడిని తమ స్వగ్రామమైన ఖమ్మంజిల్లా తిరుమలాయిపాలెం మండలం సుబ్లేడుకు తీసుకెళ్లాడు. ఇంటి వద్ద విద్యార్థిని పరిశీలించగా శరీరంపై తీవ్రంగా కొట్టిన ఆనవాళ్లు ఉండటంతో ఏంజరిగిందని కుమారుడిని ప్రశ్నించాడు. తనతో పాటు మరో నలుగురు విద్యార్థులపై వైస్ ప్రిన్స్‌పాల్ ఉపేందర్ అకారణంగా కర్రలతో చితకబాదాడని కౌశిక్ చెప్పడంతో వెంటనే సుధాకర్ సంబంధిత అధికారులతో పాటు ఖమ్మం కలెక్టర్ ఫిర్యాదు చేశాడు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పాఠశాల ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఈవిషయం ఆలస్యంగా తెలిసిందని, వైస్ ప్రిన్స్‌పాల్‌ను మంద లించామని తెలిపారు.

పొలంలో కొండ చిలువ కలకలం

చిరునోములలోని ఓ రైతు పొలంలో సంచారం

భయంతో హతమార్చిన స్థానికులు



స్థానికుల చేతిలో హతమైన కొండ చిలువ ఇదే..

బోనకల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా బోనకల్ మండలం చిరునోముల గ్రామంలో గురువారం కొండ చిలువ సంచారం ప్రజలను భయాందోళనకు గురి చేసింది. గ్రామానికి చెందిన ఆకుల సాంబశివరావు పొలంలో జాడు గడ్డిని కోస్తుండగా కొండ చిలువ కనిపించింది. ఒక్కసారిగా షాక్ గురైన అతడు కేకలు వేశాడు. ప్రజలు అక్కడకు చేరుకొని కొండ చిలువను చూశారు. అందరూ కలిసి దానిని హతం చేశారు. హతమైన కొండ చిలువ పొడవు దాదాపు 12 అడుగుల ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి దగ్గరలో కొండలు, అడవులు లేక పోయినా, కొండ చిలువ సంచరించడం మండలంలో కలకలం రేపింది.

బాలికపై లైంగిక దాడికి యత్నించిన నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఎస్సై మాలోత్ రమాదేవి



నిందితుడిని భద్రాచలం సబ్ జైలుకు రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

సుజాతనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ మైనర్‌పై లైంగిక దాడికి యత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సుజాతనగర్ ఎస్సై మాలోత్ రమాదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గరీబ్‌పేట గ్రామానికి చెందిన తెల్లబోయిన వినయ్ (గణేష్)(24) ఈనెల 2వ తేదీన అదే మండలానికి చెందిన గొల్లగూడెంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చి మధ్యాహ్నం ఎవ్వరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన 16ఏళ్ల మైనర్‌ను బలవంతంగా ఇంట్లోకి లాక్కెళ్లి ఆమె శరీర భాగాలపై చేతులు వేయడంతో.. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలపగా అతనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 4వ తేదీన అతనిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా గురువారం నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. కొత్తగూడెం కోర్టు అతనిని రిమాండ్‌కు భద్రాచలం సబ్ జైలుకు పంపడం జరిగిందని వెల్లడించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు : వ్యక్తికి గాయాలు



గాయపడిన సకునా

జూలూరుపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటన మండలంలోని కొమ్ముగూడెం గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొమ్ముగూడెంకు చెందిన బానోత్ సకునా చేలో నుంచి ద్విచక్ర వాహనంపై పత్తి సంచిని తీసుకుని ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో మణుగూరు డిపోకు చెందిన టీఎస్ 28 టీఏ 2529 నెంబర్ గల ఎయిర్‌బస్సు మణుగూరు నుంచి ఖమ్మం వైపు వెళ్తూ కొమ్ముగూడెం గ్రామ సమీపంలో ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సకునాకు గాయాలు కావడంతో 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందిన సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. బస్సును పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు.

మెట్టినింట దొంగతనానికి కోడలి స్కెచ్

అత్త సొమ్ములు కాజేసేందుకు తండ్రి, కుమారుడితో కలిసి పథకం

సుపారీ గ్యాంగ్‌తో బేరం.. బెడిసికొట్టిన వ్యూహం

రెక్కీ నిర్వహిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులకు చిక్కిన వైనం

తొమ్మిది మందిని అరెస్టు చేసిన పోలీసులు.. పరారీలో కోడలు

వివరాలు వెల్లడించిన పాల్వంచ డీఎస్పీ సతీష్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

పాల్వంచ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అత్త ఇంటికే కన్నం వేయాలనుకుని పథకం రచించిన ఓ కోడలు అడ్డంగా బుక్కయ్యింది. తన అత్త దగ్గర ఉన్న డబ్బులు కొట్టేసేందుకు తన తండ్రి, కుమారుడితో కలిసి స్కెచ్ వేసి.. ఏకంగా సుపారీ గ్యాంగ్‌తో ఒప్పందం కుదుర్చుకుని రంగంలోకి దింపింది. ఈ పథకం అమల్లో అవసరమైతే అడ్డొచ్చిన వారిని చంపాలని కూడా నిర్ణయించుకున్నారు. కానీ రెక్కీ దశలో ఈ ప్లాన్ బెడిసికొట్టింది. దొంగతనానికి వచ్చిన సుపారీ గ్యాంగ్ పెట్రోలింగ్ పోలీసులకు దొరకడంతో కోడలి అసలు కథ వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరిగిన ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను గురువారం పాల్వంచ డీఎస్పీ సతీష్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలో దమ్మపేట సెంటర్ ప్రాంతంలో ఓ కార్ల షోరూం సమీపంలో గురువారం తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తున్న పాల్వంచ పోలీసులకు రెండు కార్లలో అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని గుర్తించారు. ఆ కార్లను ఆపి సోదా చేయగా వాటిలో ఉన్న వ్యక్తుల వద్ద ఒక కత్తి, రెండు ఐరన్ రాడ్లు, నాలుగు మంకీ క్యాప్‌లు ఉండటంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. కాగా దమ్మపేట సెంటర్ దగ్గరలో నివాసం ఉండే అబ్దుల్ రసూల్ అనే వ్యక్తి తల్లి అయిన ఫరాసుల్తానా దగ్గర ఉన్న డబ్బు, ఇతర సొమ్ములను దొంగతనం చేయడానికి వచ్చామని, దొంగతనం చేసే సమయంలో ఎవరైనా అడ్డువస్తే వారిపై దాడి చేసి అయినా సొమ్ములను తీసుకురావాలని అబ్దుల్ రసూల్ భార్య ఇసరత్, వారి కుమారుడు అబ్దుల్ వాజిద్, ఇసరత్ తండ్రి జనగామ జిల్లాకు చెందిన మహమ్మద్ ఒస్మాన్ తమతో ఒప్పందం కుదుర్చుకున్నారని పోలీసులకు తెలిపారు. పట్టుబడిన వారిలో జనగామ జిల్లా బచ్చన్నపేటతో పాటు హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది ఉన్నారని, వారు రెక్కీ నిర్వహిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారని, ఆ తొమ్మిది మందిలో మహమ్మద్ ఒస్మాన్, అబ్దుల్ వాజిద్ కూడా ఉన్నారని డీఎస్పీ సతీష్ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ ఘటనలో ప్రధాన నిందితురాలైన మహమ్మద్ ఇసరత్ పరారీలో ఉందని.. నిందితుల్లో జనగామ జిల్లాకు చెందిన ఇసరత్ తండ్రి మహమ్మద్ ఒస్మాన్, ఆమె కుమారుడు భద్రాద్రి జిల్లా పాల్వంచ దమ్మపేట సెంటర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ వాజిద్‌తో పాటు జనగామ జిల్లాకు చెందిన గంగారం కృష్ణ, ఎర్ర కనకరాజు, బండారపు నాగరాజు, సిద్దిపేట జిల్లాకు చెందిన తాడూరి దాసు, హైదరాబాద్‌కు చెందిన ఇసుకంటి ఇమాన్యుయల్, పొడిశెట్టి ప్రవీణ్, వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన కొత్తకొండ గణేష్ ఉన్నారని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో పాల్వంచ సీఐ సతీష్, ఎస్సై సుమన్ పాల్గొన్నారు. అయితే ఫరాసుల్తానా ఆమె కుమారుడు అబ్దుల్ రసూల్, కొడలు ఇసరత్, మనవడు అబ్దుల్ వాజిద్ అంతా ఒకే ఇంట్లో నివాసం ఉంటుండగా.. వారి ఎందుకు విబేధాలు వచ్చాయి? కోడలు తన తండ్రి, తన కుమారుడు, సుపారీ గ్యాంగ్‌తో కలిసి అత్త ఇంటికి కన్నం వేసేందుకు ఎందుకు ప్రయత్నించిందనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

రూ.23.43లక్షల గంజాయి, గంజాయి ఆయిల్ స్వాధీనం



పట్టుబడిన నిందితులు, వాహనాలు

ఇల్లెందు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పోలీసులు గురువారం ఒడిస్సా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి ముఠాను అరెస్టు చేశారు. ఇల్లెందు సీఐ తాటి పాముల సురేశ్, ఎస్సై హసీనాల ఆధ్వర్యంలో ఇల్లెందు సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఒక కారు దానివెంట అనుసరిస్తున్న రెండు ద్విచక్రవాహనాలపై అనుమానం రావడంతో ఆపి విచారణ జరపడంతో గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టైంది. దీంతో కారును, ద్విచక్రవాహనాలను పోలీసులు తనిఖీ చేయడంతో కారులో గంజాయి, గంజాయితో తయారు చేసిన ఆయిల్ లభ్యం కావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో ఒడిస్సా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా సాగుతున్న గంజాయి రవాణా సమాచారం వెల్లడైంది. గంజాయి రవాణా చేస్తున్న హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు చెందిన సూర్యప్రభు వాసంశెట్టి, నర్సింహా సాయికిరణ్, సఫావత్ హనుమంతు, ఆవుల నవీన్, నక్క నాగప్రణదీప్, చింతడ సాయికుమార్‌లను అరెస్టుచేశారు. వీరంతా యువకులే, వీరిలో ఒక మైనర్ కూడా ఉండడం గమనార్హం. నిందితుల నుంచి రూ.9.93లక్షల విలువైన 20కిలోల గంజాయి, రూ.12.50లక్షల విలువైన గంజాయి ఆయిల్‌ను కారుతోపాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేశ్ తెలిపారు. నిందితులు ఒడిస్సాలోని జీ-72 దిమ్మలూరు నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడించినట్లు ఆయన తెలిపారు.

ఒడిస్సాలో రూ.2వేలు.. కర్ణాటకలో రూ.10 వేలకు అమ్మకం

ఖమ్మంలో 3,430 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలో తక్కువ ధరకు ఎండు గంజాయిని కొనుగోలుచేసి కర్ణాటకలో అమ్మే ముఠాను ఖమ్మం ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు. ఖమ్మం ఎక్సైజ్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల మేరకు బెంగుళూర్‌కు చెందిన కే.ఈశ్వర్, పీ.సంజయ్‌లు ముఠాగా ఏర్పడి ఒడిస్సాలో కేజీ గంజాయిని రూ.2వేలకు కొనుగోలుచేసి అక్రమంగా బెంగుళూరుకు తరలించి కేజీ రూ.10వేలకు అమ్ముతున్నారు. ఇలా అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని ఖమ్మంలో ఎక్సైజ్ 1టౌన్ అధికారులు వాహన తనిఖీలో గురువారం పట్టుకున్నారు. నిందితులతో పాటు 3,430 కేజీల ఎండు గంజాయిని సీజ్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

హత్య కేసులో ఐదుగురి నిందితుల అరెస్టు

ఖమ్మం రూరల్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో ఐదుగురు నిందితులను గురువారం అరెస్టుచేసిన ఘటన గురించి విలేకరుల సమావేశంలో సీఐ ముష్కరాజు వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని ముత్తగూడెంలో రెండు రోజుల క్రితం రెండు కుటుంబాల మధ్య దాంపత్య గొడవ కారణంగా గునుగంటి నాగమణి(45)ని తన అన్న మోటపోతుల వెంకటేశ్వర్లు, అతని కుమారుడు మనోజ్‌కుమార్, వెంకటేశ్వర్లు బావమరిది వెల్డి వెంకన్నలు కలిసి గునుగంటి నాగమణిని అతని కుమారుడు ఉమామహేశ్వరరావుపై కత్తులతో దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో కత్తిపోట్లకు నాగమణి అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలపాలైన ఉమామహేశ్వర్‌రావు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నాగమణి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి మోటపోతుల వెంకటేశ్వర్లు, అతని కుమారుడు మనోజ్‌కుమార్, అతని బావమరిది వెల్డి వెంకన్న, అతని భార్య అనిత, కూతురు అఖిలలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

తిమ్మిరిగూడెంలో పోడు రగడ

మొక్కలు నాటొద్దని అటవీ అధికారులను అడ్డుకున్న ఆదివాసీలు



తిమ్మిరిగూడెంలో ట్రెంచ్ పనులను అడ్డుకుంటున్న ఆదివాసీలు

చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చర్ల మండలం తిమ్మిరిగూడెం గ్రామంలోని 45 హెక్టార్లలో మొక్కలు నాటేందుకు ట్రెంచ్ నిర్మించేందుకు వెళ్ళిన చర్ల అటవీశాఖ అధికారులను గురువారం స్థానిక ఆదివాసీలు అడ్డుకున్నారు. ఈ మేరకు భారీ బందోబస్తు మధ్య చర్ల పోలీసులు అక్కడికి చేరుకుని వివాదాన్ని సద్దుమనిగించారు. తిమ్మిరిగూడెం గ్రామంలో సుమారు 45 హెక్టార్లలో ఉన్న భూమిలో మొక్కలు నాటేందుకు చర్ల అటవీశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే 30 హెక్టార్లలో ట్రెంచ్ తీసి మొక్కలు నాటారు. అప్పుడు కూడా గిరిజనులు ఆ భూములు తమవేవంటూ అడ్డుకున్నారు. గురువారం మిగిలిన 15 హెక్టార్లలో మొక్కలు నాటేందుకు అటవీశాఖ అధికారులు ఎక్స్‌కలేటర్‌లో ట్రెంచ్ తీసేందుకు అక్కడికి వెళ్ళారు. ఇదే క్రమంలో అక్కడికి చేరుకున్న వందల మంది ఆదివాసీలు పనులను అడ్డుకున్నారు. ఈ భూములు తమవని గత కొంతకాలంగా సాగుచేస్తున్నామని వాపోయారు. మొక్కలు నాటోద్దని అధికారులతో వాగ్వాదానికి దిగారు. వాగ్వాదం కాస్తా గొడవకు దారి తీయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ విషయం తెల్సుకున్న చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి అక్కడికి చేరుకుని ఆదివాసీలు, అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. సమస్యలను కూర్చొని మాట్లాడుకోవాలని గొడవకు దిగొద్దని సూచించారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ట్రెంచ్ పనులు నిలిపివేశారు. కాగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈ రడగ కొనసాగింది. చర్ల రేంజ్ అధికారి కృష్ణ, డీఆర్‌వో అచ్చయ్య, సెక్షన్ అధికారి రాజేష్ తదితరులు ఉన్నారు.

హ్యాండ్‌బ్యాగులో నుంచి బంగారం చోరీ

10 తులాల ఆభరణాలు అపహరణ

లబోదిబోమంటున్న బాధితురాలు : పోలీసులకు ఫిర్యాదు

మానుకోట ఆర్టీసీ బస్టాండ్‌లో ఘటన

మహబూబాబాద్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని బస్టాండ్‌లో బంగారం అపహరణకు గురైంది. బస్సు ఎక్కుతున్న మహిళా హ్యాండ్‌బ్యాగ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 10 తులాల బంగారు ఆభరణాలను తస్కరించారు. ఈ ఘటన మహబూబాబాద్ పట్టణంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎస్‌కె రజీనా వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం బుధరావుపేట గ్రామంలోని బంధువుల ఇంట్లో శుక్రవారం జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు అశ్వారావుపేట నుంచి నర్సంపేటకు ఇద్దరు పిల్లలతో ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. మహబూబాబాద్ బస్టాండ్‌లో దిగి టిఫిన్ చేసిన అనంతరం బాధితురాలు రజీనా, ఇద్దరు పిల్లలతో కలిసి బస్సులో బుధరావుపేటకు బయలు దేరాలు. మహబూబాబాద్ పట్టణం దాటుతున్న క్రమంలో బస్సు కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించేందుకు హ్యాండ్‌బ్యాగ్ ఓపెన్ చేయగా, బ్యాగ్‌లో ఉన్న 10 తులాల ఆభరణాల బాక్స్ లేదు. దీంతో అవాక్కయిన బాధితురాలు బస్సు నిలిపివేసి, అందులో ఉన్న ప్రయాణికులందరినీ చెక్ చేసింది. అయినా ఫలితం లేకపోవడంతో తిరిగి మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన సీఐ జి.మహేందర్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలంకు చేరుకొని బాధితురాలు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లోని క్యాంటీన్, పరిసర ప్రాంతాల సీసీ కెమెరాలను పరిశీలించారు. అపహరణకు గురైన బంగారం విలువ సుమారు రూ. 15లక్షలు ఉంటుంది. అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

12లోపు సభ్యత్వాలు పూర్తి చేయాలి: టీజేఎస్

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి సభ్యత్వ నమోదును ఈనెల12లోపు పూర్తిచేయాలని ఆపార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు పేర్కొన్నారు. గురువారం నగరంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16లోపు పూర్తిచేసిన సభ్యత్వం పూర్తయిన వాటిని అప్పగించాలని కోరారు. సభ్యత్వాలు పూర్తయిన మండలాల్లో పూర్తి స్థాయి మండల కమిటీలు వేసి డిసెంబరు 9న రాష్ట్ర పార్టీఅధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ సమక్షంలో జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సయ్యద్ అజీమ్, భట్టు రాజేందర్, గడ్డం వెంకటరెడ్డి, బెల్లంకొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దు

మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడొద్దని కార్పొరేటర్లు తమ డివిజన్లలో జరిగే పనులను తనిఖీలు చేపట్టాలని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. గురువారం 12వ డివిజన్‌లో రహదారి నిర్మాణ పనులను మేయర్ తనిఖీ చేశారు. సీసీ రోడ్డు నిర్మాణంపై పలు ఆదేశాలిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృషితో రాష్ట్రంలోనే ఖమ్మం నగరం అభివృద్ధిలో మోడల్‌గా మారిందన్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో గోడనిర్మాణంతో పాటుగా మైదాన ప్రాంతంలోను వరద, డ్రైయినేజీ నీరు వెళ్లేందుకు విడివిడిగా అండర్ డ్రైయినేజీ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల కురిసన వర్షాలకు మున్నేరు వరద ఉధృతి ఎక్కువగా వ్యాపించినా కేఎంసీ అధికారులు, కార్పొరేటర్లు విశేషంగా కృషి చేశారని మున్నేరు పరివాహక ప్రాంతంలో ఎటటువంటి నష్టం వాటిల్లకుండా సహాయక చర్యలు జరిగాయన్నారు. స్థానిక కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు చిరుమామిళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న సిలార్‌సాహెబ్

తిరుమలాయపాలెం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు అభివృద్ధి కార్యక్రమాలు సద్వినియోగించకని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీవో సిలార్‌సాహెబ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మత్స్యకారుల సొసైటీ అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఉచిత చేపపిల్లల కోసం మండలంలోని చెరువులు, కుంటలల వివరాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఈవోఆర్డీ ప్రభాకర రెడ్డి, ఇరిగేషన్ ఏఈలు శ్రీనివాస్, రామ కృష్ణ, కార్యదర్శి సుజాత, స్రవంతి, ఓర వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోష్, పోక్సోలపై అవగాహన ఉండాలి

» ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ శ్రీజ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి):పోష్‌చట్టం-2013, పోక్సో చట్టం-2012 చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. గురువారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాల్‌లకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ స్థలాల్లో మహిళలు రక్షణ కలిగి ఉండేందుకు 'పోష్ చట్టం' రూపొందించబడిందని, లైంగిక వేధింపులకు గురైన మహిళలు ఫిర్యాదు చేసేందుకు అంతర్గత కమిటీలు, జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. లైంగిక వేధింపుల సంఘటన జరిగిన 90 రోజుల్లో విచారణ పూర్తి చేయాలని, చర్యల్లో నిర్లక్ష్యం వహిస్తే సంస్థలకు జరిమానా విధించబడుతుందని అన్నారు. ఈసమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డిసిపివో విష్ణువందన, జీసీడీఓ తులసి, ఏపీవో శ్రీనివాస్, బాలల సంరక్షణ జిల్లా కోఆర్డినేటర్ సమీన్, జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల, అధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీజ

పీఎంశ్రీ నిధులపై సమీక్ష

పీఎంశ్రీ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ పి. శ్రీజ అన్నారు. గురువారం ఖమ్మంనగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎం శ్రీ నిధుల వినియోగంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 28 పీఎంశ్రీ పాఠశాలలకు నిధులు మంజూరు అయ్యాయని, వీటినిసమర్థవంతంగా వినియోగించు కుంటూ, మెరుగైన విద్యాబోధన అందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులను పరిశ్రమల విజిట్ తీసుకొని వెళ్లాలని, దీనికి సంబంధించి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అవసరమైన వాహనాలు రవాణాశాఖ అధికారి సహకారంతో ఏర్పాటు చేయాలని అన్నారు. ఈసమావేశంలో విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సిహెచ్. రామకృష్ణ, మండల విద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

తిరుమలాయపాలెం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని, రైతుసంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని జిల్లాకాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి తెలిపారు గురువారం మండలంలోని కాకరవాయి, సుబ్లేడు గ్రామాలలో వ్యవసాయ శఖ బీరోలు సొసైటీ ఆధ్వర్యంలో ఏరాపటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిఆయన ప్రారభించారు. ధాన్యం మద్దతుధరతతో పాటు రూ.500బోనస్ అందిస్తుందన్నారు. రైతులుపండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగలు కేంద్రాలలో అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. ప్రైవేటు వ్యక్తులకు అమ్మి మోసపోవద్దన్నారు. ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, తహసీల్దర లూథర్ విల్సన్, ఏఈవో బాలకృష్ణ, సీఈవో పావురాల వెంకటేశ్వర్లు, నాయకులు సుమన్‌రెడ్డి, రవికాంగ్‌రెడ్డి, లింగయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఖమ్మంనగరంలో జరిగింది. సుమారు 50 ఏళ్ల వయస్సున్న వ్యక్తి ఎఫ్‌సీఐగోదాం రోడ్డులో మృతి చెంది ఉన్నాడని సమాచారం రావడంతో త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ప్రత్యక్ష సమీక్షపై ఖండన

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీతో ప్రపంచం పరుగెడుతుంటే ఖమ్మం జిల్లా ప్రధానోపాధ్యాయులు రివ్యూ మీటింగ్‌లో ప్రత్యక్షంగా పాల్గొనడానికి ఖమ్మంపరుగెత్తాల్సి రావటం శోచనీయమని రివ్యూ మీటింగ్ లను ప్రత్యక్షంగా కాకుండా జూమ్ ద్వారా ఆన్లైన్‌లో నిర్వహించాలని పీఆర్‌టీయు జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కట్ట శేఖర్ రావు, ఆర్ రంగారావు పేర్కొన్నారు. దూర ప్రాంత్రాల నుంచి రావటంతో విద్యాబోధన కుంటుపడుతున్నదన్నారు.

డీఎల్పీవో తనిఖీ

కామేపల్లి,నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీఎల్పీఓ రాంబాబు గురువారం తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణపై తగుసలహాలు సూచనలు చేశారు.గ్రామంలో పారిశుధ్యం, మౌళిక సుదుపాయాలపై ఆరా తీశారు.

ఈహెచ్‌ఎస్ సేవలకు అంతరాయం

» డిస్పెన్సరీలో గదుల ఖాళీ చేయమన్నందుకు సిబ్బంది ఆగ్రహం

» సూపరింటెండెంట్ ఆదేశాలతో సేవలు

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈహెచ్‌ఎస్ సేవలకు గురువారం అంతరాయం ఏర్పడింది. దీంతో ఇక్కడి వైద్యులకు, వచ్చిన రిటైర్డ్ ఉద్యోగులు (చికిత్సకోసం వచ్చిన రోగులు) జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు వాదోపవాదాలు జరిగాయి. జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈహెచ్‌ఎస్ డిస్పెన్సరీ కొనసాగుతోంది. వెల్‌నెస్‌సెంటర్‌లో రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు సేవలు అందిస్తున్నారు. ఈడిస్పెన్సరీకి వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడే 6గదులు కేటాయించారు.



ప్రశ్నిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

సదరం క్యాంపునకు వచ్చే వికలాంగులు, ఇతరత్రా వారి కోసం వెల్‌నెస్ కేంద్రంలోని ఆరుగదుల్లో రెండు గదులను ఖాళీ చేయాలంటూ సూపరింటెండెంట్ వెల్‌నెస్ కేంద్రం సిబ్బందికి సూచించారు. దీంతో గురువారం ఉదయం ఆ గదుల్లోని సామాన్లను వేరే గదిలోకి తరలిస్తుండగా వెల్‌నెస్ కేంద్రం సిబ్బంది వైద్యులు అడ్డుకున్నారు.అర్థాంతరంగా ఖాళీ చేయమంటే ఎలా అంటూ ప్రశ్నించారు. అంతేకాకుండా వైద్య పరీక్షలను చేయకుండా నిలిపివేశారు. అప్పటికే అక్కడికి చికిత్స కోసం వచ్చిన రోగులు (రిటైర్డ్ ఉద్యోగులు)పెద్దసంఖ్యలో గుమికూడారు. వైద్య సేవలనునిలిపివేయడంతో విసుగుపుట్టిన వారు సూపరింటెండెంట్ వద్దకు వెళ్లి ప్రశ్నించారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆగ్రహం

రోగులుజీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌కు వచ్చి వాదనకు దిగారు. బీపీకి ఇతర చికిత్సలకు మందులే ఇవ్వడం లేదని దీని వలన ప్రతి నెలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సూపరింటెండెంట్ వెల్‌నెస్ కేంద్రం వైద్యులను పిలిపించారు. రోగుల ముందే వారిని వారించారు. సేవలు నిలిపివేస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు కూడా సర్ది చెప్పారు. ఆ తర్వాత వెల్‌నెస్ కేంద్రంలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను చేరుకోవాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను చేరుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జిల్లా ఉద్యానవన, సహకారశాఖ, తెలంగాణ ఆయిల్ ఫెడ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన అధికారులకు శిక్షణ, అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. రైతులకు ఆయిల్ పామ్ పంట సాగు అధిక లాభాలు కల్గిస్తుందని అన్నారు. 76 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, దీని కోసం కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. సోమవారం పీఏసీఎస్. చైర్మన్లతో మరోమారు సమావేశం నిర్వహించాలని, రాబోయే గురువారం నుంచి ఫీల్డ్‌లెవల్ లో పని చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులు ఇంటికి ఇవ్వడానికి వీలు లేదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగుల స్టాక్ ఎప్పటి కప్పుడు పరిశీలించాలన్నారు. జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట సాగు వల్ల రైతులకు ఆదాయం పెరిగి జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాఉద్యానవన అధికారి మధుసూదన్,డీసీఓ గంగాధర్, సెరికల్చర్ డీడీ ముత్యాలు, ప్యాక్ సెక్రెటరీస్, హార్టికల్చర్ అధికారులు, హార్టికల్చర్ ఎక్స్టెన్షన్ అధికారులు, ఫీల్డ్ కన్సల్టెంట్ ఆఫీసర్, తెలంగాణ ఆయిల్ ఫెడ్,గోద్రెజ్ ఆగ్రోవెట్ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

మెకానిక్ కుటుంబానికి ఆర్థికసాయం



ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు6(ఆంధ్రజ్యోతి):ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెకానిక్ కుటుంబానికి జిల్లా టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆరిసాయం అందించారు. నగరానికి చెందిన మెకానిక్ డేగల ఉపేందర్ 30 ఏళ్లగా మెకానిక్ వృత్తిలో పని చేస్తున్నాడు. రెండునెలల క్రితం రోడ్డుప్రమాదంలో గాయాలయ్యాయి. దీంతో యూనయిన్ తరుపున రూ.75వేలను యూనియన్ ఖమ్మం పట్టణ ప్రధాన కార్యదర్శి లింగనబోయిన మురళి,వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ అన్వర్ అందించారు. యూనియన్ అద్యక్షుడు వంగాల కొండలరావు మాట్లాడుతూ మెకానిక్‌లకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.

సమస్యల వలయంలో ముదిరాజ్ కాలనీ

» అధ్వానంగా రహదారులు, డ్రైయినేజీ

» 7వ డివిజన్ ప్రజల అవస్థలు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపాలిటీ హోదా నుంచి ఖమ్మం నగర పాలక సంస్థగా అప్‌గ్రేడ్ కావటంతో ఖానాపురం గ్రామ పంచాయతీ కీలకంగా మారింది. ఖానాపురం గ్రామపంచాయతీ విలీనం కాకముందు ఖమ్మం మునిసిపాలిటీ కంటే రెట్టింపు స్థాయిలో అభివృద్ధి జరిగింది. విలీనం జరిగిన తర్వాత ఖానాపురంలోని శివారు ప్రాంతాలపై ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు దృష్టి సారించలేదు. అభివృద్ధి పనుల నుంచి పారిశుధ్య సిబ్బంది నియామకం వరకు వివక్ష ఏర్పడిందని స్థానిక ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. అత్యధిక ముదిరాజ్‌లు ఉన్న ముదిరాజ్ కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయి. ఇదేప్రాంతం నుంచి వైఎస్ఆర్ నగర్‌కు, అనేక కాలనీలకు రహదారి కాని ప్రధాన రహదారుల నుంచి అంతర్గత రహదారులు, డ్రైయినేజీల సమస్యలు ప్రజల్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ఇటీవల మేయర్ పునుకొల్లు నీరజ డివిజన్ పర్యటన సందర్భంగా ప్రజలు తమ ఆవేదన వెల్లబుచ్చారు. రహదారులు మరమత్తులు చేయాలని, డ్రైయినేజీ నిర్మాణాలు, పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కానీ ఆ మేరకు పనులు ప్రారంభం కాకపోవటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ముదిరాజ్ కాలనీలో ధ్వంసమైన రహదారి

హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కోరం

» తాళ్లగూడెం-పింజరమడుగు బీటీరోడ్డుకు నిధులు మంజూరు

» రూ.4.20 కోట్లు కేటాయింపు

» ఐదు గ్రామాల ప్రజలు హర్షం

కామేపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): హామీ ఇచ్చి నిలబెట్టుకునే నాయకులు కొందరే ఉంటారు.. వారిలో ఇల్లెందు ఎమ్మెల్యే కొరం కనకయ్య ఒకరు.. మీకుగ్రామానికి రోడ్డు వేయిస్తానని వందలమంది సమక్షంలో హామీ ఇచ్చారు.. రెండు నెలల వ్యవధిలోనే రోడ్డు మంజూరు చేయించారు. దీంతోఐదు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.తాళ్లగూడెం నుంచి పింజరమడుగు, పాతలింగాల రైస్ మిల్లు వరకు 8.5కిలోమీటర్లు ఉంది.ఎస్‌డీఎఫ్ నిధులు రూ.4.20కోట్లు బీటీరోడ్డు మంజూరు అయింది. 17యేళ్ల క్రితం ఈరోడ్డు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం, దివంగతనేత రాంరెడ్డి వెంకటరెడ్డి కృషితో బీటీరోడ్డు నిర్మాణం జరిగింది. వర్షాలకు వరదలకు రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. గుంతలమయంగా ఉండటంతో ప్రయాణించడానికే వీలుగా లేకుండా మారింది. గతబీఆర్ఎస్ ప్రభుత్వంలో స్థానికులు పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఇటీవల ఆగస్ట్ 29న పింజరమడుగులో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించడానికి వచ్చిన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు గ్రామప్రజలు,మండల కాంగ్రెస్ నాయకులు రహదారి సమస్యను వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాజాగా నిధులు మంజూరు చేయించారు.దీంతోమండల నాయకులు గోపాల్‌రెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, జగన్నాథరెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ, జీ.రాంబాబు సర్పంచులు, ఐదు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఊట్కూర్‌లో ముత్యాలమ్మ గుడి నుంచి స్మశానవాటికు వెళ్లేందుకు రూ. 1.8 కోట్లతో రోడ్డు మంజూరు అయింది.



పింజరమడుగులో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం(ఫైల్)

సైబర్ నేరాలపై అవగాహన అండాలి

వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు6(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఉచితం లేదా,ఉత్తమ ఆఫర్ల వెనుక దాగి ఉన్న మోసాన్ని గుర్తించాలని ఖమ్మం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఖమ్మంబస్‌స్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు ప్రతిరోజూ కొత్తమార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు ప్రజల భద్రతకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ వ్యక్తిగత అప్రమత్తత చాలా అవసరమని తెలిపారు. లాటరీ లేదా పెద్ద మొత్తంలో డబ్బు గెలుచుకున్నారని చెప్పే నకిలీ ఆఫర్లను నమ్మవద్దని, ఇలాంటి వాటి వెనుక వ్యక్తిగత సమాచారం లేదా డబ్బు కాజేసే ఉద్దేశమే ఉంటుందన్నారు. ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ పరిధిలోని డైట్ కాలేజ్ విద్యార్థులకు ఇన్స్పెక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఇతర సైబర్ నేరాలపై స్థానిక ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. నేరం జరిగిన గంటలోపు 1930అనే టోల్ ఫ్రీనంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

తిరుమలాయపాలెం: సైబర్‌నేరాల పట్ల విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు. గురువారంమండలంలోని సుబ్లేడ్‌క్రాస్‌రోడ్డువద్ద ప్రభుత్వ గిరిజన బాలుర రెసిడెన్సియల్‌పాఠశాల విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాలలో విద్యావంతులే అధికంగా నష్టపోతున్నారని, నష్టపోతే వెంటనే 1990కి సమాచారం అందించాలన్నారు. ఈసమావేశంలో ప్రిన్సిపాల్ బాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి: ఉచిత లేదా ఉత్తమ ఆఫర్ల వెనుక దాగి ఉన్న మోసాన్ని గుర్తించాలని కామేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. గురువారం కొమ్మినేపల్లి, పోన్నెకల్ హైస్కూల్‌లలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సామాజిక మధ్యమాలలో ఏపీకే ఫైల్స్‌తో రివార్డులని, లాటరీలో నగదు గెలుచుకోవచ్చని వినూత్న రీతిలో ప్రజలను మోసంచేసే నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైన అనుమానపు కాల్స్ వస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేయాలన్నారు.



బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ కరుణాకర్

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి: శారద

వైరా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో రాణించాలని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ జాయింట్ సెక్రటరీ కె.శారదా ఆకాంక్షించారు. వైరాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో మూడురోజులపాటు జరగనున్న భద్రాద్రి 11వ జోనల్‌స్థాయి క్రీడలను శారదా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, ఒలంపిక్ క్రీడల్లో రాణించాలని ఆమె సూచించారు. సంస్థ జోనల్ అధికారిణి విద్యారాణి, జిల్లా కన్వీనర్ కె.రాజ్యలక్ష్మీ, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత, అలాగే 14గురుకులాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎందరో విప్లవకారులు ప్రాణాలర్పించారు

సీపీఐ (ఎంఎల్)డివిజన్ కార్యదర్శి ఉమర్



సత్తుపల్లిలో మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ నాయకులు

సత్తుపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ ఏనుగు అప్పయ్య, బత్తుల వెంకటేశ్వరరావు, చలమన్న లాంటి విప్లవకారులు ఎందరో ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ ప్రాణాలను అర్పించారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎస్‌కే.ఉమర్ అన్నారు. అమరులైన అన్నల ఆశయాలను కొనసాగించాలని పిలుపునిస్తూ గురువారం సత్తుపల్లిలో అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారి ఆశయాల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడదామని పిలుపునిచ్చారు. భూమికోసం, భుక్తికోసం పరపీడన విముక్తి కోసం జరుగుతున్న ఉద్యమాలలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని, అప్పుడే అమరులకు నిజమైన నివాళులని అన్నారు. మారుతి రాఘవులు, తేజావత్ భీముడు, లక్ష్మీ, రమణ, పద్మ, రమాదేవి, వాసం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ సంధ్య

ఏన్కూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల విద్యాలయంలో గురువారం సైబర్ నేరాలపై ఎస్‌ఐ నారబోయిన సంధ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు గురైన బాధితులు1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. నేషనల్ సైబర్‌క్రైం రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అపరిచితులు, అనుమానస్పద కాల్స్ సందేశాలకు తమ బ్యాంకు వివరాలు, వ్యక్తిగత వివరాలు తెలియచేయవద్దన్నారు. అనుమానస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసుసిబ్బంది, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

జమలాపురం ఆలయ హుండీ లెక్కింపు

ఎర్రుపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం కానుకల హుండీని ఆలయ అధికారుల సమక్షంలో ఆలయ సిబ్బంది శ్రీ సత్యసాయి సేవాసమితి సభ్యులు గురువారం లెక్కించారు. భక్తులు శ్రీవారికి సమర్పించిన కానుకలు, ముడుపులు 133 రోజలకుగాను రూ.38,45,670లు వచ్చినట్టు ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. జిల్లా దేవాదాయశాఖ పరిశీకులు ఈ.వెంకటేశ్వర్లు హుండీ లెక్కింపుని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులుఉప్పల శ్రీనివాసశర్మ, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెట్ కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, ఆలయ సిబ్బంది, శ్రీసత్యసాయిసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను కట్టడి చేయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్‌ఐ రామారావు

వైరా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండి దాని కట్టడికి సమిష్టిగా కృషి చేయాలని వైరా ఎస్‌ఐ పుష్పాల రామారావు సూచించారు. మండలంలోని సిరిపురం హైస్కూల్లో గురువారం నిర్వహించిన సురక్షిత గ్రామ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా గురించి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండి కలిసికట్టుగా పనిచేస్తే దాన్ని కట్టడి చేయడం సాధ్యమేనని ఆయన స్పష్టం చేశారు. అక్రమ రవాణా ద్వారా కోట్లరూపాయల వ్యాపారం జరుగుతుందని, దీని ద్వారా వ్యభిచార వృత్తిలోకి నెట్టడంతోపాటు బలవంతపు వెట్టిచాకిరి, అవయవాలను అమ్మడం, మత్తు పదార్థాలు అలవాటుచేసి వాటి రవాణాకు వినియోగించటం వంటి దారుణమైన పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని నిరోధించేందుకుగానూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ అనుమానం వస్తే వెంటనే డయల్ 100కుగానీ లేక 18004198588 లేక 1098కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కె.సుజాత, శ్రీనివాస్, లతీఫ్, సురేష్, కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణానికి స్థలం అప్పగింత



స్థల పత్రాలను అప్పగిస్తున్న అధికారులు

చింతకాని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ నిర్మాణానికి గుర్తించిన భూమి తాలుకా పత్రాలను గురువారం రెవెన్యూ అధికారులు సంబంధిత మార్కెటింగ్ అధికారులకు అందజేశారు. నూతన వ్యవసాయ మార్కెట్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, వైఎస్ చైర్మన్ పర్రగాని తిరుపతిరావు, కమిటీ డైరక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అండర్-14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

పెనుబల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అండర్-14, అండర్-17 విభాగాలకు సంబంధించి వాలీబాల్ పోటీలకు బాలబాలికల ఎంపికలు జరిగాయి. వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో ఈ ఎంపికలను ఎంఈవో సత్యనారాయణ ప్రారంభించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీవీ.రరామారావు, పీడీ బండి రాము ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఎంపికల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 40మంది బాలురు. 30మంది బాలికలు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12,13తేదీల్లో మధిరలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అనంతలక్ష్మీ, పీడీ రవీంద్రబాబు, పీఈటీలు అచ్యుత్, నర్సింహారావు పాల్గొన్నారు.

ఆడిట్‌తో అవినీతి నిగ్గుతేలేనా?

వైరా మునిసిపాలిటీలో ఆడిట్ చేపట్టిన అధికారులు



మునిసిపాలిటీలో ఆడిట్ అధికారులు

వైరా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో ఆడిట్ ప్రక్రియ మొదలైంది. ఈ ఆడిట్‌తో అయినా మునిసిపాలిటీలో పెచ్చురిల్లిపోతున్న అవినీతి అక్రమాలు పూర్తిస్థాయిలో వెలుగుచూసేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 2018 ఆగస్టు 2న వైరా మునిసిపాలిటీ ఏర్పడింది. అప్పటి నుంచి అధికారులు, పాలకవర్గాల ఏలుబడిలో కోట్లరూపాయల అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయనే తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రం మొత్తం మీద వైరా మునిసిపాలిటీ ప్రత్యేక స్వయం ప్రతిపత్తి ఉందా అనే రీతిలో ఇక్కడ అవినీతి అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేదనే విమర్శలున్నాయి. ఈ మునిసిపాలిటీ ఏర్పడిన తర్వాత ముగ్గురు కలెక్టర్, ఐఏఎస్‌లైన ఇద్దరు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ఈ మునిసిపాలిటీలోని అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోయారనే విమర్శలున్నాయి. ప్రస్తుత అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మునిసిపాలిటీ ప్రత్యేక అధికారిణిగా ఉన్నారు. 2020-2025 జనవరి వరకు పాలకవర్గం పనిచేసింది. అంతకముందు తిరిగి మళ్లీ పదినెలలుగా ప్రత్యేక అధికారులు, కమిషనర్ల పాలనలో ఈ మునిసిపాలిటీ పనిచేస్తోంది. ఈ మునిసిపాలిటీలో ఇన్‌చార్జ్ జూనియర్ అకౌంటెంట్‌గా పనిచేసిన జూనియర్ అసిస్టెంట్ అయిన అయితం రాజు వెంకటేశ్వర్లు అప్పటి కమిషనర్ చింతా వేణు కనుసన్నల్లో తన పేరిట, మరో ముగ్గురు సిబ్బంది పేరుతో బ్యాంకు సెల్ఫ్ చెక్కులతో రూ.54లక్షలకుపైగా నిధులను డ్రా చేశారు. ప్రస్తుత జూనియర్ అకౌంటెంట్ కిరణ్ ఫిర్యాదుతో ఈ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. పురపాలకశాఖ వరంగల్ రీజనల్ డైరెక్టర్(ఆర్డీఎంఏ) సాహిద్ మసూద్ విచారణ నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు నుంచి నిధులు డ్రా చేసిన వెంకటేశ్వర్లను సస్పెండ్ చేశారు. అయితే అప్పటి కమిషనర్ తోపాటు తాత్కాలిక సిబ్బందిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వెలుగుచూసిన అవినీతి ఇదైతే.. ఇంకా వెలుగు చూడని అవినీతి అక్రమాలు ఈ మునిసిపాలిటీలో భారీగానే ఉన్నాయనే ఆరోపణలున్నాయి. మునిసిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఉన్న డాక్టర్ శ్రీజ చొరవతో ఆడిట్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ ఆడిట్‌లోనైనా నిజాలు నిగ్గుతేల్చాలని, అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకుని ప్రక్షాళన చేయాలని మునిసిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

పశువైద్య శిబిరాన్ని సందర్శించిన జాయింట్ డైరెక్టర్



టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్

మధిర రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం జాలిముడి, ఇల్లెందుపాడు గ్రామాల్లో జరుగుతున్న పశువైద్యశిబిరాలను గురువారం పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బోడేపూడి శ్రీనివాసరావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శిబిరాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. పశువులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పశువైద్య సిబ్బందికి శాస్త్రీయ పద్ధతిలో శిబిర నిర్వహణ గురించి పలు సూచనలు చేశారు. ప్రతి పశువుకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని రైతులకు అవగాహనకల్పించారు. మండలంలో ఇప్పటికే 90శాతం గ్రామాల్లో టీకాలు పూర్తి చేయగా మిగిలిన గ్రామాల్లో కూడా షెడ్యూల్ ప్రకారం శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఉమాకుమారి, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్లకు ఉచిత వైద్య పరీక్షలు



వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బోనకల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా అడిషనల్ కలెక్టర్ పి. శ్రీజ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లకు గురువారం బోనకల్ పీహెచ్‌సీలో వైద్య పరీక్షలను నిర్వహించారు. మొత్తం 71 మందికి గానూ 58 మందికి పరీక్షలు చేశారు. సీబీపీ, టైఫాయిడ్, కిడ్నీ, లివర్ పరీక్షలను చేయడం జరిగింది. విద్యార్థులకు భోజనం అందించే వారు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో పరీక్షలు చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, దానయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతకాని: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి గురు, శుక్రవారాల్లో మండలంలోని అన్ని పాఠశాలల్లోని కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని మండల వైద్యాధికారి అల్తాఫ్ తెలిపారు. అనంతరం కార్మికులకు వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యం గురించి అవగాహన కల్పించారు. సిబ్బంది సోహేల్, అనిల్, సుప్రియ, గ్రీష్మ, మధుమయి, రేచల్ రాణి, వీరేందర్, నాగేశ్వరరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన ముస్లిం నాయకులు



అజయ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ముస్లిం నాయకులు తమ సమస్యలను ప్రస్తవించేందుకు గురువారం సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన మండల ముస్లిం కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రవూఫ్‌తోపాటుగా పలువురు ముస్లిం నాయకులు సబ్‌కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ముస్లిం సామాజికవర్గానికి సంబంధించి ప్రధాన సమస్యలను వారు ప్రస్తావించగా సానుకూలంగా స్పందించారు. ఇకపై ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకోరాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు సయ్యద్ అమీరుద్దిన్, ఎస్‌కె కమ్లి, సయ్యద్ నబి తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధం కావాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని



ప్రసంగిస్తున్న పోతినేని సుదర్శన్

తల్లాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు రైతులు పోరాటానికి సిద్ధం కావాలని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ అన్నారు. గురువారం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన రైతుసంఘం సత్తుపల్లి డివిజన్ మహాసభనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. జీనవానధారమైన వ్యవసాయం నుంచి దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. అమెరికా నుంచి పత్తి, గోధుమలు, కోడి, పంది మాంసాలు దిగుమతికి అనుమతినిస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్వదేశీ వ్యవసాయానికి మంగళం పాడుతుందని విమర్శించారు. సీసీఐ కఠిన నిబంధనలతో పత్తిని రైతులు ప్రైవేటు దళారులకు తక్కువ ధరకు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సీసీఐ కఠిన నిబంధనలు ఎత్తివేసి ప్రభుత్వం ప్రకటించిన పత్తి క్వింటాల్‌కు రూ.8110లు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బొంతు రాంబాబు మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా కౌలురైతులు సాగులో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, వారికి అవసరమైన సబ్సిడీలు, బ్యాంకు రుణాలు ప్రభుత్వం అందించాలని కోరారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు, శీలం సత్యనారాయణరెడ్డి, ఫకీరమ్మ, రామలింగేశ్వరావు, సాయిన్ని ప్రకాశరావు, రాజబాబు పాల్గొన్నారు.

సామినేనిని హత్యచేసిన నిందితులను శిక్షించాలి

తల్లాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్‌నేత ఉమ్మడి ఏపీ రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సామినేని రామారావును హత్యచేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లానాయకుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. గురువారం తల్లాడలో సీపీఎం ఆధ్వర్యంలో రామారావు హత్యను నిరసిస్తూ ప్రదర్శన నిర్వహించారు. హత్యచేసి 8రోజులు అవుతున్నా ఇంతవరకు నిందితులను గుర్తించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సత్తుల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులు నల్లమోతు మోహన్‌రావు, పులి వెంకటనరసయ్య, కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్,షేక్ మస్తాన్, కళ్యాణం కృష్ణయ్య పాల్గొన్నరు.

ప్రజా ఉద్యమాలకు తోడ్పాటునందించిన రాములమ్మ

కారేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీమలపాడు ప్రాంతంలో జరిగిన పోడు కూలీ మహిళ పోరాటాలకు తన జీవితంతం తోడ్పాటు అందించిన ఉద్యమకారిణి చెవుల రాములమ్మని మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ కొనియాడారు. గురువారం చీమలపాడులో సీపీఎం సీనియర్ నాయకురాలు రాములమ్మ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెరుగు రమణ మాట్లాడారు. కొండబోయిన ఉమావతి,షేర్‌లలితమ్మ, కొండబోయిన నాగేశ్వరరావు,మండల సీపీఎం కార్యదర్శి కె.నరేందర్, వజ్జా రామారావు పాల్గొన్నారు.

9న టీయూసీఐ రాజకీయ తరగతులు



సత్తుపల్లిలో మాట్లాడుతున్న అమర్లపూడి శరత్

సత్తుపల్లిరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నేలకొండపల్లిలో వందలమందితో నిర్వహించే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఖమ్మం జిల్లా రాజకీయ తరగతులను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. గురువారం సత్తుపల్లిలో మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కార్మికవర్గ కర్తవ్యాలపై సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.సూర్యం, భారత కార్మికోద్యమ చరిత్రపై రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ, టీయూసీఐ నిర్మాణం, పనివిధానాలపై జిల్లా కార్యదర్శి జీ.రామయ్యలు ఆరోజు బోధించనున్నట్లు చెప్పారు. 4లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో ఆర్డినెన్స్‌గా ఆమోదించడంతో రాష్ట్రంలో కార్మికులకు 10గంటల పనివిధానం అమలుతో కట్టు బానిసలుగా పని చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు కల్లూరు విద్యార్థిని



బొడ్డు అంబిక

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థిని జాతీయ స్థాయి స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికైంది. ఈ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న బొడ్డు అంబిక ఖమ్మం జిల్లా తరుపున అండర్-19 విభాగంలో స్టేట్ మీట్స్‌లో తన ప్రతిభను కనబరిచి ఈ నెల 10 నుంచి 16వ తేది వరకు మధ్యప్రదేశ్‌లో జరగనున్న వాలీబాల్ క్రీడ పోటీల్లో పాల్గొననున్నది.

కారేపల్లిలో అనుమతుల్లేకుండా వెలుస్తున్న పత్తి కౌంటర్లు

పట్టించుకోని మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు



కారేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో పుట్టగొడుగుల్లా పత్తి సేకరణ కేంద్రాలు వెలుస్తున్నాయి. కేవలం మండల కేంద్రంలోనే పదికి మించి కౌంటర్లు ఏర్పాటు చేసిన దళారులు పత్తి రైతులను చిత్తుచేస్తున్నారు. దళారులు నిర్ణయించిన ధరకే రైతులు ఆరుగాలం పండించిన పత్తిని అమ్ముకుంటున్నారు. మండల కేంద్రంలోనే ఉంటున్న వ్యవసాయ, ఇల్లందు మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారుల ముందే ఈ దళారులు విచ్చలవిడిగా కౌంటర్లు ఏర్పటు చేసి పత్తిని కొనుగోలుచేస్తున్న సదరు అధికారులు చూసి చూడన్నట్లు తిరుగుతున్నారు. దీంతో దళారులు అదురుబెదురు లేకుండా రైతులను మోసం చేస్తు జేబులు నింపుకుంటున్నారు. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే పల్లెల్లో దళారుల దందా ఎలా ఉంటుందో అధికారులే ఊహించుకోవాలని ప్రజలు అంటున్నారు. రైతుల అవసరాలను అదునుగా చేసుకుని తేమ శాతం, పత్తి నల్లబడింది దీనిని మార్కెట్‌లో ఎవరు కొనరు అంటూ ప్రజలకు మాయమాటలు చెప్పి క్వింటా పత్తిని రూ.3వేల నుంచి, 5వేల వరకు కొనుగోలు చేస్తు రైతులను నట్టేటా ముంచుతున్నారు. అసలే వారం పదిపదిహేను రోటుజులుగా కురుస్తున్న వర్షాలతో పత్తిచేలు చాల వరకు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తమ పెట్టుబడులు కూడా రావడం లేదనే సందిగ్ధ పరిస్థితిలో ఉండగా.. పుండు మీద కారం చల్లినట్లుగా దళారులు పత్తి రైతులను నిండా ముంచుతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతులతో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ ప్రియ కాటన్ జిన్నింగ్ మిల్లును ఇటీవలే ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ప్రాంభించిన సీసీఐ కేంద్రంలో రైతుల నుంచి నేరుగా పత్తికొనుగోలు చేయాల్సిఉంది. ఈ సీసీఐ కేంద్రం ద్వార పత్తిని కొనుగోలు చేస్తే కొంత మేరకు రైతులకు ఉపయోగం ఉంటుందని రైతులు వేడుకుంటున్నారు. ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యేలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండనేరుగా ప్రభుత్వ మద్దతూ ధర రూ.8200కు కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికైనా సంబధిత సీసీఐ అధికారులు రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలుచేయాలని, ఎలాంటి అనుమతులు లేకుండానే రైతులను మోసంచేస్తున్న దళారుల పత్తి కౌంటర్లను మూసివేయాలని పలువురు కోరుతున్నారు. ఇదే విషయంపై మార్కెటింగ్ శాఖ అధికారులను వివరణ కోరగా ఇప్పటికే అక్రమంగా పత్తి కొనుగోలుచేస్తున్న వారికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. అనుమతులు లేకుండా కౌంటర్లు నడిపితే వారిపై చర్యలు తీసుకుంటమని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇల్లందు కార్యదర్శి నరేష్‌కుమార్ తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం విద్యార్థుల నిరసన



కల్లూరులో కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిపులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కల్లూరులో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకుని మరీ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు భాను శ్రీకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు, రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. నాలుగు నెలలుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. బకాయిలు విడుదల చేయని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలను సైతం నియోజకవర్గాలలో తిరగకుండా అడ్డుకుంటామన్నారు. బకాయిలతో విడుదల కాక పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి



రైతులకు మందుల గురించి వివరిస్తున్న డీఏవో పుల్లయ్య

ఏన్కూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు, మధ్యదళారులు మాటను నమ్మి మోసపోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాలలోనే పత్తిని అమ్మాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. గురువారంమండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్‌బోర్డు, బిల్ బుక్, పీవోఎస్ మిషన్లను పరిశీలించి మాట్లాడారు. రైతులు కిసాన్ కపాస్‌యాప్ ద్వారా స్లాట్ బుక్‌చేసుకుని విక్రయించుకోవాలని తెలిపారు. మొక్కజొన్న విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఏవోనరసింహారావు, ఏఈవో లహరి పాల్గొన్నారు.